RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 30 ఏప్రిల్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:279

## తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణం చేపట్టే కార్యాచరణ వేగవంతం చేయాలి ఎ.రేవంత్ రెడ్డి





తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణం చేపట్టే కార్యాచరణ వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

బుధవారం ఎంసీహెచ్ఆర్డీ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇరిగేషన్ ఇంజనీర్లు, నిపుణులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, ఈఎన్సీ శ్రీధర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

తుమ్మిడి హెట్టి బ్యారేజ్ ని ఎంత ఎత్తున నిర్మించాలి.. ఎంత ఎత్తు నిర్మిస్తే ఎంత నీటిని వినియోగించుకునే వీలుందని ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ మీద ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం దాదాపు 11 వేల కోట్లు ఖర్చు చేసిందని, ఇప్పటికే కొన్ని చోట్ల కాల్వల నిర్మాణం కూడా జరిగింది. ఇప్పటికే 71.5 కిలోమీటర్ల కెనాల్ వర్క్ జరిగిందని అధికారులు సీఎం కు వివరించారు.

150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే కనీసం 100 టీఎంసీల నీటిని వినియోగించుకునే వీలుంటుందని, తెలంగాణ ప్రయోజనాలు నెరవేరుతాయని సూచించారు.

ఇప్పటికే చేపట్టిన నిర్మాణాలన్నిటిని సద్వినియోగం చేసుకునేందుకు 150 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మించాలని నిపుణులు సూచించారు.

గతంలో జరిగిన చర్చల ప్రకారం మహారాష్ట్ర 148 మీటర్ల ఎత్తు నిర్మించేందుకు అంగీకరించిందని.. 152 మీటర్ల ఎత్తు నిర్మిస్తే మహారాష్ట్ర పరిధిలో ముంపు ప్రభావం ఉంటుందని మధ్యేమార్గంగా 150 మీటర్ల ఎత్తు నిర్మిస్తే తక్కువ ఖర్చు తో నీటిని తీసుకునే వీలుందని ఇంజనీరింగ్ నిపుణులు సూచించారు.

ఈ బ్యారేజ్ నిర్మాణం చేపడితే ఆదిలాబాద్ తో పాటు తెలంగాణలో మెట్ట ప్రాంతాల రైతుల కు సాగు తాగు నీరు అందుతుందని,

తక్కువ ఖర్చుతో గ్రావిటీ పై శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్ కు నీటిని తెచ్చుకునే వీలుంటుందని సీఎం చెప్పారు.

ప్రాజెక్ట్ ప్రాధాన్యత దృష్ట్యా వెంటనే మహారాష్ట్ర తో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్ర లో పెద్దగా ముంపు ప్రభావం ఉండదని, ఎక్కడైనా ముంపు వాటిల్లితే పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు.

మహారాష్ట్రలో బీజేపీ అధికారంలో ఉన్నందున ఆ ప్రభుత్వాన్ని ఒప్పించి తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కి వెంటనే లేఖ రాయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి సీఎం సూచించారు.

సమీక్ష సమావేశం ముగిసిన వెంటనే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాయాలని నిర్ణయం తీసుకున్నారు.

రేపు కేంద్ర మంత్రి అపాయింట్మెంట్ తీసుకొని నేరుగా కలిసి చర్చించే బాధ్యతను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి అప్పగించారు,

తుమ్మిడిహెట్టి బ్యారేజ్ అవసరం దృష్ట్యా మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ రైతుల తరపున విజ్ఞప్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్దరణ చర్యల్లో భాగంగా చేపడుతున్న జియో టెస్టింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను అదేశించారు. వానలు పడేలోపు పనులు పూర్తి చేయాలని మరోసారి స్పష్టం చేశారు.




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిని రాష్ట్ర డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్ గారు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు నూతన డీజీపీ కి అభినందనలు తెలియజేశారు

## హైనెకెన్‌సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బ్రూయింగ్ కంపెనీ హైనెకెన్ (ఊఇఎఔఇఐఇఔ) హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో "హైనెకెన్ బిజినెస్ సర్వీసెస్ ఇండియా" పేరిట 76వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ను బుధవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు.ఇది ఫైనాన్స్, డిజిటల్, టెక్నాలజీ, అనలిటిక్స్ రంగాల్లో గ్లోబల్ సర్వీసులను అందించే స్ట్రాటజిక్ సెంటర్ గా పని చేయనుంది.ప్రస్తుతం 300 మందికి పైగా నిపుణులకు కొత్తగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య 1600కు చేరుకోనుంది.ప్రపంచ బ్రూయింగ్ రంగంలో 150 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఒక దిగ్గజ సంస్థ హైనెకెన్.ప్రపంచవ్యాప్తంగా 190కి పైగా దేశాల్లో హైనెకెన్ ఉత్పత్తులు అమ్ముడవుతున్నాయి.70కి పైగా దేశాల్లో 165 కంటే ఎక్కువ బ్రూవరీలను హైనెకెన్ నడుపుతోంది.

## బెంగాల్ రెండో విడత ఎన్నికల్లో భారీగా పోలింగ్ నమోదు




బెంగాల్ ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )బంగాల్ రెండో విడత ఎన్నికల్లో భారీగా పోలింగ్ నమోదైంది. సాయంత్రం 5 గంటల వరకు 90 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. ఇంకా క్యూలైన్లలో అనేక మంది ఓటర్లు నిల్చున్నారు.

ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ కొనసాగనుంది. కలకత్తా, హౌడా, హుగ్లీ, ఉత్తర, దక్షిణ 24పరగణా వంటి కీలక జిల్లాల్లోని 142 స్థానాలకు పోలింగ్ జరుగుతోంది. ఓటింగ్ కోసం 41 వేలకుపైగా పోలింగ్ కేంద్రాలను ఎన్నికలసంఘం సిద్ధం చేసింది. ప్రతీ పోలింగ్ కేంద్రం నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రత్యక్ష నిఘా పెట్టనున్నట్లు ఈసీ తెలిపింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని హింస జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఈసీ భద్రత కట్టుదిట్టం చేసింది. మే 4న బంగాల్‌తోపాటు అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ప్రకటించనున్నారు.

# అర్జీ ఏదైనా.. పరిష్కారం పక్కా!

## ఆరెంపుల క్లస్టర్ 'ప్రజాదర్బార్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వార్తా 2 లో






## పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ములుగు జిల్లా అగ్రస్థానంలో నిలవడం పట్ల మంత్రి సీతక్క హర్షం



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 29 ములుగు**పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రవ్యాప్తంగా ప్రథమ స్థానంలో నిలవడం పట్ల పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు.

కష్టపడి చదివి అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారికి మార్గనిర్దేశం చేసిన గురువులకు, అలాగే పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించిన అప్పటి జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్, జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు.

ములుగు జిల్లా 99.30 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమని అన్నారు. ఇది జిల్లా స్థాయిలో సమన్వయంతో చేసిన కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి పరీక్షల్లో మొత్తం ఉత్తీర్ణత శాతం 95.15 శాతంగా నమోదు కావడం సంతోషకరమని తెలిపారు. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణతతో ముందంజలో ఉండగా, బాలురు 94.07 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని అన్నారు.

అలాగే రాష్ట్రవ్యాప్తంగా 5731 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని సూచిస్తోందని మంత్రి అభిప్రాయపడ్డారు.

సంక్షేమ పాఠశాలల్లో 99.10 శాతం ఉత్తీర్ణత నమోదవడం ప్రభుత్వ పథకాల ఫలితమని మంత్రి తెలిపారు. పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు అందుతున్న నాణ్యమైన విద్య వల్లే ఈ స్థాయి ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు మరింత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

ప్రజాబలం

30 ఏప్రిల్ 2026 గురువారం

# ఆప్...సోపాలు

ఒకప్పుడు ఆమ్ఆద్మీ పార్టీ పేరు వింటే చాలు, సగటు మనిషి ఛాతీ గర్వంతో మరో రెండు అంగుళాలు విశాలమయ్యేది. అవినీతిని అంతమొందించడంలో, ప్రజారంజకమైన పాలన అందించడంలో ఆ పార్టీ ముందుంటుందన్న ధైర్యం వారిలో అడుగడుగునా కనబడేది. కానీ, పద్నాలుగేళ్లు తిరిగేసరికి ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అవినీతి కూపంలో నిండా మునిగిపోయి, ఊపిరాడక సతమతమవుతున్న ఆ పార్టీ సగటు మనిషికి ఏనాడో దూరమైంది. ఈ పరిస్థితికి కొంతవరకూ ఆ పార్టీ అధినేత కారణం కాగా, మరికొంత కేంద్రంలో చక్రం తిప్పుతున్న ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా కారణం. ఈ మిత్రద్వయం తరచూ వేస్తున్న ఎత్తుగడలకు చిత్తవడం కేజ్రీ వంతవుతోంది. మద్యం కుంభకోణం కేసులు బనాయించి, ముఖ్యమంత్రినే అరెస్ట్ చేయించి, ఆ కేసుల ఆధారంగా పార్టీ పెద్దలపై అవినీతి ముద్ర వేసి, ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకున్న ఈ కమలనాథులు అంతటితో ఆగలేదు. రాజ్యసభ సభ్యులైన ఏడుగురు ఆమ్ఆద్మీ పార్టీ నేతలను తమవైపు తిప్పుకుని, బిజెపిలో విలీనం చేసుకోవడం తాజా పరిణామం.ఢిల్లీ మద్యం కేసులో సిబిఐ కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో రాబోయే పంజాబ్ ఎన్నికల్లో గెలుపు తమదేనని సంతోషిస్తున్న కేజ్రీవాల్‌కు ఆ సంబరం మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది. నిన్నటివరకూ తనకు, పార్టీకి కుడిభుజంలా నిలబడినవారు సైతం అకస్మాత్తుగా ఇలా 'ఫిరాయించడం'తో కేజ్రీ దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఆమ్ఆద్మీ పార్టీ పెట్టకముందునుంచీ కేజ్రీవాల్‌కు అత్యంత సన్నిహితులుగా మెలగిన రాఘవ్ చద్దా, స్వాతి మలీవాల్ వంటివారు సైతం బిజెపి గూటికి చేరిపోవడం వింతల్లోకెల్లా వింత. రాజ్యసభలో తమ బలాన్ని పెంచుకోవడం, రాబోయే పంజాబ్ ఎన్నికల్లో పాగా వేయడం లక్ష్యంగా మోడీ, షా ద్వయం తాజా వ్యూహానికి తెర తీశారన్నది విస్పష్టం. ఆప్ ఎంపిల చేరికతో రాజ్యసభలో బిజెపి సభ్యుల బలం 113కి చేరగా, ఎన్‌డిఎ బలం 146కు పెరిగింది. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం) లో లొసుగులను ఆసరా చేసుకుని ఇలా ఇతర పార్టీల సభ్యులకు ఎర వేసినందుకు మోడీ, అమిత్ షాలను తప్పుబట్టడంలో తప్పేమీ లేదు. అయితే, ఒక రాజకీయ పార్టీ అధినేతగా ఉంటూ, పదేళ్లపాటు ఢిల్లీని పాలించి చాలినంత రాజకీయ, పాలనా అనుభవం గడించి కూడా.. ప్రత్యర్థుల ఎత్తుగడలను చివరిదాకా పసిగట్టలేకపోయినందుకు కేజ్రీవాల్‌నూ అంతే తప్పుపట్టాలి. ప్రాంతీయ పార్టీల పొడ అసలే గిట్టని భారతీయ జనతా పార్టీ పెద్దలు, వాటి ఊపిరి తీసేందుకు ఎంతకైనా తెగిస్తారనేది గత చరిత్రను తిరగేస్తే తెలుస్తుంది. దేశ రాజధానిలో తిష్ఠవేసుకుని కూర్చుని, తమకు పక్కలో బల్లెంలా మారిన ఆప్‌ను అంతమొందించాలన్నది మోడీ, అమిత్ షాల చిరకాల వాంఛ. అందులో చాలావరకూ కృతకృత్యులయ్యారన్నది ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకోవడంతోనే రుజువైంది. ఇక పంజాబ్ లోనూ ఆప్‌ను అధికారంనుంచి దింపడమే లక్ష్యంగా కేజ్రీవాల్ ఆరోపించినట్లు 'ఆపరేషన్ లోటస్'కు తెరతీశారు. మునుపటి ఎన్నికల్లో పంజాబ్‌లో ఆప్ విజ యం వెనుక కీలకపాత్ర పోషించిన రాఘవ్ చద్దాకు గాలం వేయడం అందులో భాగమే. అగ్నికి ఆజ్యం తోడైనట్లు, బిజెపి నేతల ఎత్తుగడలకు కేజ్రీవాల్ స్వయంకృతాపరాధాలు తోడయ్యాయి. అవినీతిని అంతం చేస్తానని నమ్మబలికిన ఆప్ అదే అవినీతికి ఆలవాలమైందన్న బిజెపి పెద్దల ఆరోపణలకు కేజ్రీవాల్ ఇంద్రభవనాన్ని తలదన్నుతూ కట్టుకున్న ఇల్లు, మద్యం కుంభకోణం వంటివి బలం చేకూర్చాయి. ఇప్పటికైనా మించింది లేదు. తమ పార్టీ నేతలు మరికొందరు చేజారకముందే ఆప్ అధినేత జాగ్రత్తపడటం మంచిది. వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే పంజాబ్ ఎన్నికల్లో బిజెపి ఎత్తుగడలను తిప్పికొట్టేలా పదునైన వ్యూహాలను రచించగలగాలి.కొన్నేళ్లుగా పంజాబ్ లో పలువురు ఆప్ నాయకులను బిజెపి నయానో భయానో తమవైపు తిప్పుకోగలిగింది. ఈ తెలివిడి, రాజకీయ చతురత లేకనే ఆప్ అగ్రనేతలు ప్రత్యర్థులు పన్నిన ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం భారత రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది ఆమ్ ఆద్మీ పార్టీ నేత రాఘవ్ చద్దా బీజేపీలో చేరిక. ఆప్ కీలక నేతగా పేరున్న రాఘవ్, అనూహ్యంగా కాషాయ పార్టీలో చేరడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఆయన ఈ నిర్ణయం వెనుక కారణాలపై పలు ఊహాగానాలు చెలరేగుతుండగా, మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ భార్య నవజ్యోత్ కౌర్ సిద్ధూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. రాఘవ్ చద్దా బీజేపీలో చేరడానికి గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రానే ప్రధాన కారణమని ఆమె పేర్కొన్నారు. "రాఘవ్ చద్దా తన సోదరి పరిణీతి చోప్రా భర్త కావడంతో ఆయనను కాపాడుకోవడానికి ప్రియాంక ఈ నిర్ణయం తీసుకున్నారు" అని కౌర్ తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు రాఘవ్ వెనుక పడ్డారని, త్వరలోనే ఆయనపై ఈడీ దాడులు జరిగే అవకాశం ఉందని ప్రియాంకకు ముందే సమాచారం అందిందని ఆమె వెల్లడించారు. అందుకే తన చెల్లెలి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాఘవ్‌ను బీజేపీ వైపు మళ్లించారని కౌర్ పేర్కొన్నారు. అంతేకాకుండా, రాఘవ్ చద్దాకు ఆప్ అధిష్టానానికి మధ్య చాలా కాలంగా విభేదాలు ఉన్నాయని నవజ్యోత్ కౌర్ సిద్ధూ వివరించారు. పార్టీ కోసం రాఘవ్ సరిగా మాట్లాడటం లేదని ఆప్ నాయకత్వం భావించిందని, ఆ కారణంగానే వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయని ఆమె తెలిపారు. ఏదైనా తప్పు జరిగినప్పుడు అప్పుడే గళం విప్పాలని, నాలుగేళ్ల తర్వాత మాట్లాడటం సరికాదని ఆమె అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ రాజకీయ మార్పు రాఘవ్ చద్దా సోషల్ మీడియా ఇమేజ్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపింది. బీజేపీలో చేరిన మరుసటి రోజే ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో 20 లక్షలకు పైగా (రెండు మిలియన్లు) ఫాలోవర్లను కోల్పోయారు. ఆప్ తన వ్యవస్థాపక సూత్రాలు, సిద్ధాంతాల నుంచి దూరంగా వెళ్లడంతో తాము బీజేపీలో విలీనమయ్యామని మీడియా సమావేశంలో చద్దా వెల్లడించారు.ఆప్ కోసం 15 ఏళ్లు నా రక్తం, చెమట ధారపోశాను.. సూత్రాలు, విలువలు, మౌలిక నైతికత నుంచి పార్టీ పూర్తిగా పక్కకు తప్పుకుంది" అని ఆయన అన్నారు. "రాజ్యాంగం ప్రకారం ఒక పార్టీకి చెందిన మొత్తం ఎంపీలలో మూడింట రెండు వంతుల మంది మరో పార్టీలో విలీనం కావచ్చు" అని తమ పార్టీలోని 10 మంది ఎంపీల బలాన్ని ప్రస్తావిస్తూ చద్దా తెలిపారు. "వారు ఇప్పటికే సంతకాలు చేశారు.. ఈ ఉదయం మేము సంతకాలు చేసిన లేఖలు, ఇతర పత్రాలతో సహా అవసరమైన అన్నింటిని రాజ్యసభ ఛైర్మన్‌కు సమర్పించడం... విలీనానికి అనుమతించడం చకచకా జరిగిపోయాయి. అవినీతికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతో పుట్టిన ఆప్.. 14 ఏళ్ల తర్వాత పార్టీ చరిత్రలోనే అత్యంత కఠినమైన సవాళ్లలో ఒకదాన్ని ఎదుర్కొంటోంది.సినీ ప్రముఖులు కునికా సదానంద్, ప్రకాష్ రాజ్ వంటి వారు కూడా రాఘవ్ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం నవజ్యోత్ కౌర్ సిద్ధూ చేసిన ఈ కీలక వ్యాఖ్యలపై ఇప్పటివరకు ప్రియాంక చోప్రా, పరిణీతి చోప్రా లేదా రాఘవ్ చద్దా నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అయితే, ఈ నిర్ణయం వెనుక నిజంగా ఇదే కథ ఉందా అనే ప్రశ్న ప్రజల్లో మొదలైంది. రాఘవ్ చద్దా రాకతో బీజేపీ బలం పెరుగుతుందా లేదా ఆమ్ ఆద్మీ పార్టీ దెబ్బతింటుందా అనేది వేచి చూడాలి.ఒకవైపు పార్టీ క్యాడర్‌ను కాపాడుకుంటూ, మరోవైపు ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తుచేసేలా రాజకీయ వ్యూహరచన చేయగలిగితేనే పంజాబ్‌లో ఆప్ అధికారాన్ని నిలుపుకునేది. మద్యం కుంభకోణ కేసులో సిబిఐ కోర్టు ఇచ్చిన తీర్పును, తాజాగా తమ పార్టీ ఎంపిల విలీనం ఉదంతాన్ని ప్రజాక్షేత్రంలోకి బలంగా తీసుకువెళ్లగలగాలి. లేదంటే జాతీయ పార్టీగా గుర్తింపు తెచ్చుకున్న ఆమ్ఆద్మీ ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేకుండా పోయే పరిస్థితి దాపురిస్తుంది.

# అర్జీ ఏదైనా.. పరిష్కారం పక్కా!

**మూడు నెలల్లోగా పెండింగ్ సమస్యలన్నీ క్లియర్**

**సాధాబైనామాలకు 45 రోజుల్లోనే విముక్తి**

**త్వరలో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ**

**ఆరెంపుల క్లస్టర్ 'ప్రజాదర్బార్ లో**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గర్జన**





**పాలేరు ప్రతినిధి ఏపి 29 (ప్రజాబలం)** ఖమ్మం రూరల్ ప్రజా ప్రభుత్వం ప్రజల ముంగిటకే వచ్చిందని, ప్రజలు ఇచ్చే ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామంలో నిర్వహించిన 'ప్రజాదర్బార్'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు

**గడువులోగా పరిష్కారం.. అధికారులకు ఆదేశం**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాధారణ సమస్యలను వారం రోజుల్లోనే పరిష్కరించాలని అధికారులకు సూచించాం. ఇక ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక సమస్యలకు గరిష్టంగా 3 నెలల గడువు విధిస్తున్నాం. ఈలోపు ప్రతి దరఖాస్తుకు ఒక స్పష్టమైన పరిష్కారం చూపడమే మా లక్ష్యం" అని ప్రకటించారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న సాధాబైనామా సమస్యలను 45 రోజుల్లోనే కొలిక్కి తెస్తామని కీలక ప్రకటన చేశారు.

**పేదల సొంతింటి కల.. మా బాధ్యత**

గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇళ్లు లేక ఇబ్బంది పడ్డ పేదలకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేశాం. ప్రతి సోమవారం బిల్లులు విడుదల చేస్తూ పారదర్శకత పాటిస్తున్నాం అని తెలిపారు. త్వరలోనే రెండో దశ ఇందిరమ్మ ఇళ్ల పంపిణీకి శ్రీకారం చుడతామన్నారు. రూరల్ మండల పరిధిలోని 12 గ్రామాల్లో గత రెండున్నరేళ్లలో రూ.386 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు.

**అన్నదాతకు వెన్నుదన్నుగా..**

రైతుల సంక్షేమంలో తమ ప్రభుత్వం రాజీ పడదని మంత్రి స్పష్టం చేశారు. రూ. 20,656 కోట్లతో 25 లక్షల మందికి రైతు రుణమాఫీ పూర్తి చేశామని, సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తున్నామని గుర్తు చేశారు. కొత్త రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్ల కోసం వేచి చూస్తున్న అర్హులకు త్వరలోనే శుభవార్త చెబుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖల చీఫ్ ఇంజనీర్లు, జిల్లా స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

# జాబ్ మేళా ను ప్రారంభించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు



హైద్రాబాద్ ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్) న్యూస్) నిరుద్యోగ యువతకు భరోసా కల్పిస్తూ డాక్టర్ శోభా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా వందలాది మంది యువతకు ఉపాధి మార్గాలు దొరకడం సంతోషకరం.

ఈ జాబ్ మేళాలో ఇంజినీరింగ్, గ్రాడ్యుయేషన్, ఫార్మసీ, పారా మెడికల్ వంటి వివిధ రంగాల నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అప్లై చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు నేరుగా ఇక్కడే ఆఫర్ లెటర్లు అందజేయడం జరిగింది. ఉద్యోగాల కోసం ఎక్కడెక్కడో వెతుక్కునే బదులు, ఇటు యువతకు, అటు కంపెనీలకు ఒకే వేదికపై పరిష్కారం లభించింది.

నేటి యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాలు లేదా పబ్లిక్ సెక్టార్ మీదనే ఆధారపడకుండా, తమ ప్రతిభతో స్టార్టప్‌ల ద్వారా ఉద్యోగ ప్రదాతలుగా మారాలి. మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు 'స్టార్టప్ ఇండియా', 'స్టాండప్ ఇండియా' వంటి పథకాలతో యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నారు.

మహిళా పారిశ్రామికవేత్తల కోసం 'ముద్రా యోజన' ద్వారా మోదీ ప్రభుత్వం అపారమైన అవకాశాలు కల్పించింది.

ఉద్యోగాల కోసం వేచి చూసే స్థాయి నుంచి, ఇతరులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి దేశ యువతను ఎదిగేలా చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. డాక్టర్ శోభా ఫౌండేషన్ వారు ఇటువంటి అర్థవంతమైన కార్యక్రమాన్ని నిర్వహించినందుకు వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

మహిళలకు రిజర్వేషన్లు కల్పించేలా మరోసారి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి, దానిని అమలు చేసి తీరుతామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు స్పష్టంగా చెప్పారు.

# హృదయ శ్వాస పునరుద్ధరణ (CPR) పై అవగాహన – లిల్లీ మేరి



కొడంగల్ ఏప్రిల్ 29 :: సిపిఆర్ పై అవగాహన కార్యక్రమంను బుధవారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల యందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లిల్లీ మేరి కార్డియోపల్మనరీ రిసక్టేషన్ (సి. పి. ఆర్) పై మాట్లాడుతూ దేశంలో ప్రతి ఏటా లక్షమందిలో 4,280 మంది సడెన్ కార్డియాక్ అరెస్టుతో మరణిస్తున్నారని, వీటి శాతాన్ని తగ్గించేందుకు సిపిఆర్ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని లిల్లీ మేరి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లిల్లీ మేరి మాట్లాడుతూ హఠాత్తుగా కుప్పకూలటం, అపస్మారక స్థితికి వెళ్లడం, శ్వాస అందకపోవడం, నాడీ కొట్టుకోకపోవడం, ఛాతిలో నొప్పి తదితర లక్షణాలు గుండెపోటుకు దారితీస్తాయని, సడన్ కార్డియాక్ అరెస్టుకు గురైతే రెండు చేతులతో సిపిఆర్ ప్రక్రియ చేపట్టి బతికించవచ్చున్నారు. బలముగా, వేగముగా చాతి మధ్యలో నిమిషానికి 100 నుంచి 120 సార్లు ఐదు సెంటీమీటర్ల లోతులో మర్దన చేయడాని సిపిఆర్ అంటారన్నారు. ఆకస్మికంగా వచ్చే కార్డియాక్ అరెస్టుతో రాష్ట్రంలో ఏడాదికి 24 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారని, కార్డియాక్ అనేది సమయము, సందర్భము, చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఎవరికైనా సడన్ కార్డియాక్ అరెస్టు వచ్చే ప్రమాదం ఉందని ప్రిన్సిపల్ హెచ్చరించారు. అయితే సకాలంలో సిపిఆర్ చేయటం వల్ల వీరి ప్రాణాలు కాపాడటం సాధ్యమవుతుంది సూచించారు. సడన్ కార్డియాక్ అరెస్టు, హార్ట్ స్ట్రోక్లు పెరుగుతున్నాయని కండ్ల ముందే ప్రాణాలు కోల్పోతున్నారని ప్రిన్సిపల్ గుర్తు చేశారు. అయితే సిపిఆర్ చేయటం వల్ల చనిపోయే వారి సంఖ్యను తగ్గించే అవకాశం ఉందని లిల్లీ మేరి వివరించారు. ప్రస్తుతం కార్డియాక్ అరెస్టు అయిన ప్రతి పదిమందిలో ఒకరు మాత్రమే బ్రతుకుతున్నారని, సిపిఆర్ సకాలంలో చేస్తే కనీసం ఐదుగురిని బ్రతికించుకునే అవకాశం ఉంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతున్నాయని లిల్లీ మేరి ఉదహరించారు. అనుకోని ప్రమాదాలు, దుర్ఘటన జరిగినప్పుడు మనిషి సైకలాజికల్ షాక్ కి గురవుతాడని, ఈ సమయంలో హృదయస్పందనలో తేడా వస్తుందని, గుండెలయతప్పి ఆగిపోతుందని, అలాంటి సమయంలో మనిషి స్పందించడని, శ్వాస ఆగిపోతుందని, ఆ సమయంలో గుండె కొట్టుకునేలా ఛాతి మీద పదే పదే ఒత్తిడి చేయడం, నోటి ద్వారా కృత్రిమ శాసన అందించడం వల్ల గుండె, ఊపిరితిత్తులు తిరిగి పెంచేస్తాయని దీన్నే సిపిఆర్ అంటారని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరి తెలిపారు. దీన్ని తెలుగులో హృదయ శ్వాస పునరుద్ధరణ అని అంటారని లిల్లీ మేరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమమునకు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# పాత బస్సులకు కొత్త రంగులు...

విజయవాడ ఏప్రిల్ 29, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుస్థిర విద్యుత్ వాహన పాలసీ 4.౦ కింద ఆర్టీసీలో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో డీజిల్ ఖర్చు తగ్గించి కాలుష్యాన్ని నివారించేందుకు విద్యుత్ బస్సుల్ని తీసుకొస్తోంది. కేంద్రం నుంచి 1050 బస్సులు కేటాయించగా.. మరో 1450 బస్సుల్ని తీసుకురావాలని నిర్ణయించింది. అంతేకాదు కాలం చెల్లిన పాత బస్సుల్ని రీమోడల్ చేసి విద్యుత్ బస్సులుగా మార్చేస్తోంది. పాత డీజిల్ బస్సును విద్యుత్ బస్సుగా మార్చేశారు. ఈ మేరకు ట్రయల్ రన్ నిర్వహించారు.ఆర్టీసీలో పాత బస్సులు కొన్ని లక్షల కిలోమీటర్లు తిరిగి ఉంటాయి.. ఈ కాలం చెల్లిన బస్సును ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ కింద రెట్రోఫిట్‌మెంట్ చేసి, విద్యుత్‌తో నడిచే ఏసీ బస్సుగా మార్చేశారు. పాత సూపర్ లగ్జరీ బస్సును కళ్యాణీ ట్రాన్స్ సంస్థ (భారత్ ఫోర్జ్) ప్రయోగాత్మకంగా విద్యుత్ ఏసీ బస్సు (ఇంద్ర సర్వీస్)గా మార్చేసింది. ఈ కొత్త ఎలక్ట్రిక్ బస్సును విజయవాడ ఆర్టీసీ హౌస్‌కు తీసుకురాగా అధికారులు పరిశీలించారు. ఈ బస్సును కొంతకాలం ట్రయల్ రన్ కోసం ఏదైనా రూట్‌లో నడపాలని నిర్ణయించారు. ఈ బస్సుకు ఎంతసేపు ఛార్జింగ్ చేస్తే ఎన్ని కిలోమీటర్లు మైలేజ్ వస్తుందో పరిశీలించనున్నారు. పాత బస్సుల్ని ఇదే తరహాలో రెట్రోఫిట్‌మెంట్ చేస్తే ఎంత ఖర్చవుతుంది?.. కొత్త విద్యుత్ ఏసీ బస్సులు తీసుకోవడం కంటే.. ఇలా పాత వాటిని మార్పు చేస్తే ఎంత ఖర్చువుతుంది? వంటి అంశాలను పరిశీలించనున్నారు. ఇప్పటికే చిత్తూరు ఆర్టీసీ డిపోలో డీజిల్ బస్సును సీఎన్జీ బస్సుగా మార్చేశారు.. ఇప్పటికే ఈ బస్సు ట్రయల్ రన్ కూడా పూర్తి చేశారు. ఇప్పుడు పాత బస్సుల్ని విద్యుత్ బస్సులుగా మార్చేస్తున్నారు.

మరోవైపు ఏపీఎస్ఆర్టీసీకి ఎలాంటి డీజిల్ కొరత లేదని ఆర్టీసీ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 11 వేల బస్సులకు రోజుకు 7.5 లక్షల లీటర్ల డీజిల్ ఖర్చవుతుంది.. అయితే ప్రస్తుతం అన్ని బస్సు సర్వీసులు ఎలాంటి ఇబ్బంది లేకుండా నడుస్తున్నాయని చెప్పారు. ఆర్టీసీ బస్సులకు సంబంధించిన డీజిల్ విషయంలో ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని అధికారులు తెలిపారు

# రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు

విజయవాడ, ఏప్రిల్ 29, ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మాడు పగలగొడుతున్నాయి.. రాష్ట్రంలో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఫిబ్రవరి నెల నుంచే ఎండల తీవ్రత కనిపించింది.. ముందు 35 డిగ్రీల నుంచి మొదలై 40 డిగ్రీల వరకు చేరింది. మార్చి నెల నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరిగాయి.. 42 డిగ్రీల నుంచి 45 వరకు ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు కూడా దాటి 46 డిగ్రీల వరకు నమోదవుతోంది. ఎండలకు తోడు వేడిగాలులు, ఉక్కపోతతో జనాలు అల్లాడిపోతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇవాళ అధిక ఉష్ణోగ్రతలతో పాటుగా 19 మండలాల్లో తీవ్రమైన వేడిగాలులు, 21 మండలాల్లో వేడిగాలులు వీచే అవకాశం ఉందన్నారు. విజయనగరం జిల్లాలోని బాడంగి, బొబ్బిలి, రామభద్రాపురం, తెర్లాం, వంగర మండలాల్లో.. అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలోని బలిజిపేట, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, మక్కువ, పాచిపెంట, పాలకొండ, పార్వతీపురం, సాలూరు, సీతానగరం, వీరఘట్టం మండలాల్లో తీవ్ర వేడిగాలుల ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. మార్కాపురం జిల్లా కంభంలో 45.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డైంది. నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 45.1 డిగ్రీలు, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 44.8 డిగ్రీలు, అమరావతిలో 44.2 డిగ్రీలు, తిరుపతి జిల్లా బెస్తపల్లిలో 44.2 డిగ్రీలు, కడప జిల్లా వీరబల్లిలో 44.2 డిగ్రీలు, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మొత్తం 28 జిల్లాలకు గాను 20 జిల్లాల పరిధిలోని 227మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.ఏపీలో ఎండలు, వేడిగాలులు, ఉక్కపోత ప్రభావం కనిపిస్తోంది.. జనాలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు. ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అంటున్నారు. రాష్ట్రంలో మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు.

# మారని తమ్ముళ్లు...

విజయవాడ ఏప్రిల్ 29, ఒకరి తర్వాత మరొకరు. ఒక ఇష్యూ తర్వాత మరో రచ్చ. ఎమ్మెల్యేలే కాంట్రవర్సీకి తెరలేపుతున్నారో..లేక వివాదాలే వాళ్లను వెతుక్కుంటూ వస్తున్నాయో తెలియదు కాని.. ప్రతి నెల రోజులకో ఎమ్మెల్యే తీరు ఇష్యూ అవుతోంది. టీడీపీ అధినేతకు హెడెక్ అవుతోంది. పర్సనల్ లైఫ్ వేరు. పబ్లిక్ లైఫ్ చాలా సున్నితమైంది. ప్రజా జీవితంలో ఉన్న నేతలు..వారి చుట్టున్న వాళ్లు చిన్న మిస్టేక్ చేసిన పెద్ద రచ్చ అవుతోంది. పొలిటికల్ లైఫే తలకిందులైన సందర్భాలు ఉన్నాయి. అందుకే చేసే ప్రతీ..మాట్లాడే ప్రతీ మాట ఎంతో ముఖ్యం. రాజకీయ నాయకులు అయితే ఎంత జాగ్రత్తగా ఉంటే అంత బెటర్. ఎంత ఆచితూచి వ్యవహరిస్తే అంత మంచిది. దూకుడే పేరు తెచ్చి పెట్టినా..ఆ దూకుడు స్వభావమే నట్టేట ముంచొచ్చు. సింపుల్ లివింగ్, లో ప్రొఫైల్..హై థింకింగ్‌కు అలవాటు పడిన వారికే బెటర్ పొలిటికల్ ఫ్యూచర్ ఉంటుందన్నది..సీనియర్ లీడర్లను చూస్తే అర్థమవుతోంది. ఎమ్మెల్యేలు సరిగ్గా ఉంటే సరిపోదు..వారి కుటుంబ సభ్యులు, అనుచరులు, సిబ్బంది అందరి ప్రవర్తన లెక్కలోకి వస్తుంది. చివరకు ఎమ్మెల్యేతో ఫోటో దిగిన వ్యక్తి ఏదైనా తప్పు చేసి దొరికినా..అది ఆ ప్రజాప్రతినిధి మెడకు చుట్టుకోవడం ..ఆయన సమాధానం చెప్పుకునే పరిస్థితులకు దారితీస్తుంది.ఏ పొలిటికల్ లీడర్ అయినా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే..తాము చేసే ప్రతి పనిని ప్రజలు గమనిస్తున్నారని. అది పబ్లిక్ మీటింగ్‌లో కావొచ్చు. రోడ్డు మీద కావొచ్చు. ఎక్కడైనా ప్రవర్తన చాలా ముఖ్యం. ఎప్పుడూ ఏ రూపంలో వివాదంలో చిక్కుకోవాల్సి వస్తుందో చెప్పలేమ్. ఏ మాత్రం టంగ్ స్లిప్ అయినా..ఎక్కడ తమ బిహేవియర్ డిఫరెంట్‌గా కనిపించినా..మీడియా, సోషల్ మీడియా చెడుగుడు ఆడేస్తుంది. ఆ తర్వాత ఎన్ని వివరణలు ఇచ్చుకున్నా..ఎన్ని కవర్ డ్రైవ్‌లు చేసినా డ్యామేజ్ కంట్రోల్ అవడం కష్టం. ఒక ఎమ్మెల్యే చేసే మిస్టేక్ ఆయనకే పరిమితం కాదు. ఓవరాల్ పార్టీకి బ్యాడ్‌నేమ్ తెస్తున్న పరిస్థితి.టీడీపీ ఎమ్మెల్యేల విషయంలో సీన్ మరోలా ఉంది. ఎప్పుడూ ఎవరో ఒక ఎమ్మెల్యే వివాదాల్లో చిక్కుకోవడం..సీఎం చంద్రబాబు సీరియస్ అవడం కామన్ అయిపోయింది. అందరిదీ ఒక కథ అయితే..కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఎపిసోడ్ సమ్‌థింగ్ డిఫరెంట్. ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యే అయిన సురేంద్రబాబుకు నియోజకవర్గంలో మంచి పేరే ఉందంటున్నారు తెలుగు తమ్ముళ్లు. ఆయన ఎలాంటి కాంట్రవర్సీలు, అనవసర విషయాలకు జోలికి వెళ్లరని చెప్తున్నారు. కానీ టోల్ ప్లాజా ఎపిసోడ్‌లో ఆయన అనుచరులు చేసిన వీరంగం పెద్ద రచ్చ అయింది. చివరకు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు రియాక్ట్ అయి కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించే వరకు వచ్చింది.టోల్ గేట్ దగ్గర ఏం జరిగింది.. తప్పు ఎవరిదన్న విషయం పక్కన పెడితే జరగాల్సిన ఇష్యూ జరిగింది. టీడీపీ, కూటమి ప్రభుత్వంపై విమర్శలు రావడం..డ్యామేజ్ కంట్రోల్ కోసం చర్యలు తీసుకోవడం చకచకా జరిగిపోయాయి. అయినా చర్చకు, విమర్శకు అవకాశం ఇచ్చినట్లు అయింది. ఇక్కడ ఎమ్మెల్యే విషయంలో ఎవరికి ఎలాంటి అభ్యంతరం లేకున్నా..ఆయన ముందే టోల్ గేట్ సిబ్బందిపై అనుచరులు దాడి చేశారన్న వార్తలు తీవ్ర విమర్శలకు దారితీశాయి.సీఎం చంద్రబాబు పదేపదే ఎమ్మెల్యేలకు సూచిస్తున్నది ఇదే. పబ్లిక్ లైఫ్‌లో ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండాలి. చిన్న ఇష్యూనే కదా ఏం కాదు అనుకుంటే కుదరదు అంటూ పదే పదే హెచ్చరిస్తూ వస్తున్నారు. ప్రజాప్రతినిధుల బిహేవియర్ చాలా ఇంపార్టెంట్. జనం మన ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటారన్న విషయం గుర్తూ చేస్తూనే ఉన్నారు. అయినా [illegible] ఎమ్మెల్యేలు.. పొరపాటుగానో..కావాలనో రచ్చకెక్కడం, ఇష్యూకు తెరలేపడం రెగ్యులర్ అయిపోయింది. అనవసర విషయాలు, కాంట్రవర్సీల్లో వేలు పెడుతున్న ఎమ్మెల్యేల విషయంలో ఇప్పటికే పలుసార్లు సీరియస్ అయిన సీఎం చంద్రబాబు..ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు నాటికి కఠినంగా వ్యవహరించాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.

# ఆకివీడు రామాలయం అడుగులు

ఏలూరు, ఏప్రిల్ 29, పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులోని పెదపేటలో శ్రీరామ నవమి కూటమి నేతలు, రామభక్తులపై దాడి ఘటన కలకలం రేపింది. మార్చి 8న పెదపేటలో రామాలయం పునరుద్ధరణ చేయాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రకటించడంతో స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చింది. కొందరు స్థానికులు మార్చి 17న కొంతమంది గొంతెనమ్మ ఆలయం పేరుతో ఫ్లెక్సీ కట్టారు. ఆ తర్వాత మార్చి 27న శ్రీరామనవమి రోజు రఘురామ పూజల కోసం వెళ్లడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కూటమి నేతలతో పాటుగా మరికొందరిపై దాడులు జరిగాయి.. ఈ కేసులో 58మందిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో నిందితుడిగా ఉన్న భీమవరానికి చెందిన మీసాల జయరాజు జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలయ్యారు. తాజాగా ఆకివీడు పెదపేట ఘటనకు సంబంధించి సంచలన విషయాలను వెల్లడించారు. పెదపేటలో వివాదం, గొడవల వెనుక పాస్టర్ ఇస్మాయిల్ పాత్ర ఉందంటూ చెప్పుకొచ్చారు.ఆకివీడులో శ్రీరామనవమి రోజు జరిగిన ఘటనలో తనపై కూడా కేసు నమోదైందని జయరాజు చెప్పుకొచ్చారు. తనపై కూడా ఆరోపణలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేయడంతో జైలకు వెళ్లి బెయిల్‌పై వచ్చినట్లు తెలిపారు. పెదపేటలో చర్చిలు కూల్చివేసి దళితులపై దాడిచేసి ఇళ్లు కూల్చి వేస్తున్నారని పాస్టర్ ఇస్మాయిల్ తనకు ఫోన్ చేశారని.. శాంతియుత ర్యాలీ చేయాలని చెప్పడంతో ఒక దళిత నాయకుడిగా తాను అక్కడికి వెళ్లానన్నారు. ఆ రోజే ఇస్మాయిల్ అనే వ్యక్తి మొదటిసారి పరిచయం అయ్యారని చెప్పుకొచ్చారు.శాంతియుత ర్యాలీ అని చెప్పి ఉన్నట్టుండి పాస్టర్ ఇస్మాయిల్ పక్కనే ఉన్న టవర్ ఎక్కారని.. శాంతియుత ర్యాలీ అని చెప్పి ఇలా చేయడం సరికాదని ఆయనకు నచ్చజెప్పానని జయరాజు తెలిపారు.ఇస్మాయిల్ టవరెక్కడంతో.. ఆయన పాస్టర్ కాబట్టి.. పెదపేటలో కూలగొట్టినట్లు చెబుతున్న చర్చిల్లో ఈయన చర్చి కూడా ఉందనే బాధతో ఇలా టవర్ ఎక్కాడని తాను భావించానన్నారు జయరాజు. కానీ ఆ తర్వాత స్థానికుల్ని అడిగి ఇస్మాయిల్ గురించి తెలుసుకుంటే.. కూలగొట్టినట్లు చెబుతున్న వాటిలో పాస్టర్ చర్చి కూల్చలేదని తెలిసిందన్నారు. కొద్దిసేపటి తర్వాత ఇస్మాయిల్ కిందకు వచ్చారని.. తాను అక్కడి నుంచి వెళ్లిపోయానన్నారు. అనంతరం చర్చిలు కూల్చివేతలపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లామని.. కానీ పాస్టర్ ఇస్మాయిల్ మాత్రం అక్కడికి రాలేదన్నారు. ఆయన్ను హౌస్ అరెస్ట్ చేసినట్లు తనకు తెలిసిందని.. ఇంలో పోలీసులు ఇస్మాయిల్‌ను కొట్టినట్లు తనకు సమాచారం వచ్చిందన్నారు. తీరా తాను వెళ్లి ఆరా తీస్తే ఆయన్ను పోలీసులు కొట్టలేదని తనకు తెలిసిందన్నారు. పాస్టర్ ఇస్మాయిల్ మాత్రం పోలీసులు తనపై దాడిచేసినట్లు ఆరోపించారని.. డిప్యూటీ స్పీకర్ రఘురామపై విమర్శలు చేశారన్నారు.'ఇస్మాయిల్ గురించి నిజాలు తెలిసిన తర్వాత ఆకివీడు పెదపేటలో స్థానికుల్ని పిలిచి అన్ని విషయాల గురించి వారితో చెప్పాను. పాస్టర్ ఇస్మాయిల్ అంతటితో ఆగకుండా చర్చిల్ని కూల్చివేస్తున్నారంటూ తన యూట్యూబ్ ఛానల్‌లో వీడియోను అప్‌లోడ్ చేయడంతో వైరల్ అయ్యింది. ఆ తర్వాత చుట్టపక్కల పాస్టర్లు ఆయన్ను పరామర్శించడానికి వచ్చారు, సన్మానం చేశారు. అప్పుడు ఇస్మాయిల్ గురించి ఆరా తీస్తే పూర్తి వివరాలు తెలిశాయి. ఇస్మాయిల్ ఆర్థికంగా స్థిరపడటానికి, రాజకీయ ఎదుగుదల కోసం ఇస్మాయిల్ ఇలా చేశారని తెలిసింది. తన సొంత ప్రయోజనాల కోసం ఇస్మాయిల్ దళితుల్ని పావులుగా వాడుకుంటున్నారు. నేను ఎక్కడా డిప్యూటీ స్పీకర్ రఘురామ గురించి ఎమ్మెల్యే గురించి మాట్లాడలేదు' అన్నారు.'పెదపేటలో అమ్మవారి గుడి కావాలి, రామాలయం వద్దని చెబుతున్నారు. ఆ విషయాన్ని పక్కన పెట్టి సొంత ప్రయోజనాల కోసం ఇస్మాయిల్ ఏదేదో మాట్లాడారు. ఈ క్రమంలోనే డిప్యూటీ స్పీకర్ రఘురామ మమ్మల్ని తప్పుగా అనుకున్నారు. నేను గత ఎన్నికల్లో కూటమి పార్టీల కోసం పనిచేశాను.. యువగళం సమయంలో నారా లోకేష్‌పై రాళ్లు వేసిన సమయంలో, పవన్ కళ్యాణ్ వచ్చిన సమయంలో ఆయనకు వ్యతిరేకగా జరిగిన ఘటనల్ని నేను ఖండించాను.. మా నాన్న, చిన్నాన్న టీడీపీలో ఉన్నారు. నేను ఏదైనా తప్పు జరిగితే.. ఇది తప్పు అని నేను రియాక్ట్ అవుతాను. ఆకివీడు పెదపేటలో జరిగిన ఘటనకు నాకు ఎలాంటి సంబంధం లేదు.. ఆ గొడవలో నన్ను ఇరికించారు. కానీ నా వాదనను ఎవరూ పట్టించుకోలేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు.'ఇస్మాయిల్ అనే వ్యక్తి స్వలాభం కోసం చేసిన పనితో నేను ఈ కేసులో ఇరుక్కున్నాను. ఈ కేసు నమోదు చేసిన తర్వాత నేను జైలుకు వెళ్లాను.. బెయిల్‌పై వచ్చాను. ఇస్మాయిల్ ఎమ్మెల్యేను విమర్శిస్తే లక్షల రూపాయలు వస్తున్నాయి. ఈ ఘటనలో ఇంకా చాలామంది జైల్లో ఉన్నారు కానీ ఇస్మాయిల్ కనీసం వాళ్లను పరామర్శించలేదు. ఇస్మాయిల్ ఈ ఘటన తర్వాత కొంతమంది దగ్గర డబ్బులు వసూళ్లు కూడా చేశారు.. ఈ ఘటనలో వాస్తవాలు తెలియాలనే నేను ఈ విషయాలను చెబుతున్నాను. ఇస్మాయిల్ చేసిన తప్పులకు సంబంధించి నా దగ్గర ఆధారాలు కూడా ఉన్నాయి. త్వరలోనే అన్ని వివరాలు చెబుతాను' అని చెప్పుకొచ్చారు జయరాజు.

# తీరనున్న కనిగిరి ప్రాంత వాసుల కల

ఒంగోలు, ఏప్రిల్ 29, పశ్చిమ ప్రకాశం, మార్కాపురం జిల్లావాసులు.. ముఖ్యంగా కనిగిరి ప్రాంత ప్రజల కలనెరవేరనుంది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రైలు సౌకర్యం త్వరలోనే అందుబాటులోకి రానుంది. గుంటూరు నుంచి కనిగిరి వరకు ప్యాసింజర్ రైలును నడిపేందుకు రైల్వే అధికారులకు ప్రతిపాదనలు పంపారు. వారంలో ఆరు రోజుల పాటూ రైలును నడిపేలా ప్రతిపాదించారు. రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారని.. త్వరలోనే అధికారిక ప్రకటన వస్తుందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో కేంద్రం సహకారంతో రైల్వే ప్రాజెక్టుల పనులు వేగవంతం అవుతున్నాయి. పాత ప్రాజెక్టులతో పాటుగా కొత్త ప్రాజెక్టులు కూడా ఒక్కొక్కటిగా పట్టాలెక్కుతున్నాయి. రాష్ట్రంలో కీలకమైన నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు వేగవంతం చేసి ఉమ్మడి ప్రకాశం జిల్లా, ప్రస్తుతం మార్కాపురం జిల్లా కనిగిరి వరకు పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం పామూరు వైపుగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కనిగిరి వరకు రైల్వే లైన్ పనులు పూర్తికావడంతో అక్కడి వరకు రైళ్లు నడపాలని ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులతో పాటుగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.. రైల్వేశాఖకు విన్నవించారు.కనిగిరివాసుల ఎన్నో ఏళ్ల కలను నిజం చేసే దిశగా ఓ ముందడుగు పడింది. నడికుడి టు శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్‌లో కనిగిరి వరకు ప్యాసింజర్ రైలును నడిపేందుకు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. గుంటూరు నుంచి గుండ్లకమ్మ మీదుగా కనిగిరి వరకు ఈ రైలును నడిపేందుకు గుంటూరు రైల్వే డివిజన్ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఈ నెల 24న ఆ వివరాలు అధికారుల దగ్గరకు చేరాయి. తాజా ప్రతిపాదనల ప్రకారం వారంలో ఆరు రోజుల పాటూ గుంటూరు నుంచి కనిగిరి వరకు ఈ కొత్త సర్వీస్‌ను నడపాలని ప్రతిపాదించారు. ఈ ప్యాసింజర్ రైలు గుంటూరులో ఉదయం 8.30 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1 గంటకు కనిగిరి చేరుకునేలా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 2 గంటలకు కనిగిరి నుంచి బయల్దేరి రాత్రి 7 గంటలకు గుంటూరు చేరుకునేలా ప్లాన్ చేశారు. అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే పూర్తి షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందంటున్నారు.నడికుడి టు శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్‌లో కనిగిరి వరకు రైలును నడపాలని గతంలోనే ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి రైల్వే అధికారులకు విన్నవించారు. ఇటీవల రైల్వే అధికారుతో మాట్లాడటంతో సానుకూలంగా స్పందించారు. కనిగిరి రైల్వే స్టేషన్ పనులు పూర్తికావడం, ప్రయాణికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందబాటులోకి రావడంతో ఎలాంటి ఇబ్బందులు లేవు అంటున్నారు. ఇప్పటికే ట్రయల్ రన్ కూడా పూర్తి చేయడంతో.. కొత్తగా ప్యాసింజర్ రైలును కనిగిరి వరకు నడిపేందుకు దాదాపుగా లైన్ క్లియర్ అయినట్లేనని చెబుతున్నారు. కనిగిరి నుంచి ప్యాసింజర్ రైలు ప్రారంభమైతే ఆ ప్రాంతం నుంచి రాజధాని ప్రాంతమైన గుంటూరుకు కనెక్టివిటీ కూడా పెరుగుతుందంటున్నారు. కనిగిరి మాత్రమే కాదు పొదిలి, దర్శి ప్రాంతాల ప్రజలకు కూడా ఎంతో సౌకర్యంగా ఉంటుంది. మొత్తం మీద మార్కాపురం, పశ్చిమ ప్రకాశం జిల్లావాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతోంది.

# కాపు వర్గం మారుతోందా

కాకినాడ, ఏప్రిల్ 29, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వచ్చినట్లే కలలు కంటోంది. ఎంతగా అంటే వచ్చే ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేస్తమన్నంతగా. ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో తాము సులువుగా గెలుస్తామన్న గుడ్డినమ్మకంతో ఆ పార్టీ నేతలు ఉన్నట్లు కనిపిస్తుంది. అందుకే నేతలు ఎక్కడిక్కడకక్కడ ఈ సమయంలోనూ తమ నియోజకవర్గంలో వ్యాపారాలు దెబ్బతినకుండా టీడీపీ నేతలతో కుమ్మక్కువుతున్నారన్న ఆరోపణలున్నాయి. రాష్ట్రంలోని అనేక నియోజకవర్గాల్లో టీడీపీ, వైసీపీ మిలాఖత్ అయి మద్యం, ఇసుక వంటి వ్యాపారాలు చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. అయితే ఇవి లోపాయికారిగా జరిగినప్పటికీ బాహ్య ప్రపంచానికి మాత్రం సులువుగానే తెలుస్తోంది.అందుకే ప్రజలు రెండు పార్టీలను ఒకే గాటిన కట్టే అవకాశముంది. ముఖ్యంగా వైసీపీకి పట్టున్న కొన్ని జిల్లాల్లోనూ టీడీపీ నేతలతో వ్యాపార సంబంధాలను నెరుపుతూ గుట్టుగా పది రూపాయలు సంపాదించుకునే పనిలో ఉన్నారు. అందుకే స్థానిక ఎమ్మెల్యేలపై విమర్శలు చేయడం లేదు. టీడీపీ ఎమ్మెల్యేలు కూడా తమపై వ్యక్తిగత ఆరోపణలు చేయకుండా వారిని తమలో ఒకరిగా చేర్చుకుని కొత్త స్ట్రాటజీకి తెరదించారు. ఈ విషయాలను వైసీపీ కార్యకర్తలే సోషల్ మీడియా ద్వారా బయటకు చెబుతున్నారు. ఉదాహరణకు నెల్లూరు జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో కొందరు వైసీపీ నేతలు టీడీపీ నేతలతో కలసి రహస్యంగా వ్యాపార భాగస్వాములుగా ఉన్నారు.అయితే వైసీపీ కేంద్ర నాయకత్వం వీటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. లైట్ గానే తీసుకుంటుంది. అంతెందుకు వైఎస్ జగన్ సొంత జిల్లా కడపలోనూ అనేక మంది వైసీపీ నేతలకు టీడీపీ నేతలతో లోపాయికారీ ఒప్పందాలున్నట్లు చెబుతున్నారు. ఇవి కార్యకర్తలకు తెలుసు. కానీ వైసీపీ నాయకత్వం మాత్రం వారిపై చర్యలకు తీసుకోవడానికి మాత్రం సిద్ధంగా లేదు. ఇలాగే కొనసాగితే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కానీ, తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో కానీ వైసీపీ నేతలు అధికార పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే అవకాశం లేదన్నది వాస్తవం. ఇప్పటికైనా నాయకత్వం జాగ్రత్త పడకపోతే నష్టం స్థాయి అంచనా వేయలేని స్థితిలో ఉండనుంది.

# గుజరాత్ కమలానిదే...

గాంధీనగర్, ఏప్రిల్ 29,గుజరాత్ లో బీజేపీ తన పట్టును నిలుపుకుంది. అక్కడ జరిగిన స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. మొత్తం 15 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగ్గా.. 15 కార్పొరేషన్లూ బీజేపీ కైవసం చేసుకుంది. దీంతో గుజరాత్ లో బీజేపీదే బలం అని మరోసారి రుజువు చేసినట్లైంది. ఇక.. కాంగ్రెస్, ఆప్ పత్తా లేకుండా పోయాయి. కనీసంలో కనీసం నామ మాత్రపు పోటీ కూడా ఇవ్వలేకపోయాయి. మొత్తం 1,044 సీట్లుండే 15 మున్సిపల్ కార్పొరేషన్లలో బీజేపీ 856 సీట్లను కైవసం చేసుకోగా, కాంగ్రెస్ 77 సీట్లు గెలుచుకుంది. ఇక ఇతరులు 12 స్థానాల్లో విజయం సాధించారు.రాజ్‌కోట్‌లో బీజేపీ పనితీరు కూడా అత్యంత ఆకట్టుకునేలా సాగింది; మున్సిపల్ కార్పొరేషన్‌లోని 72 స్థానాలకు గాను ఆ పార్టీ 65 స్థానాలను కైవసం చేసుకోగా, కాంగ్రెస్ కేవలం 7 స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఇక్కడ కనీసం తన ఖాతాను కూడా తెరవలేకపోయింది. ఇంతలో, రాజ్‌కోట్ జిల్లా పంచాయతీలోనూ బీజేపీ 36 స్థానాలకు గాను 34 స్థానాలను గెలుచుకుని ప్రతిపక్షాల ఉనికినే ప్రశ్నార్థకం చేసింది.ఇక.. అహ్మదాబాద్ లోని 192 స్థానాలకు గానూ బీజేపీ 158 స్థానాలను కైవసం చేసుకోగా, కాంగ్రెస్ 22 స్థానాలను గెలుచుకుంది. సూరత్ లో 120 స్థానాలుంటే బీజేపీ 115 స్థానాల్లో గెలుపొందగా, ఆప్ 4 స్థానాల్లో గెలిచింది. కాంగ్రెస్ మాత్రం ఒకే ఒక్క స్థానానికే పరిమితమైంది.రాజ్ కోట్, వడోదరా, భావ్ నగర్ లో బీజేపీ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంది. రాజ్ కోట్ లో 72 స్థానాలకు గాను బీజేపీ 65, కాంగ్రెస్ 7 స్థానాలను, వడోదరాలో 76 వార్డులకు గానూ బీజేపీ 69, కాంగ్రెస్ 6 వార్డుల్ని గెలుచుకుంది. భావ్ నగర్ లో మొత్తం 52 వార్డులుండగా.. బీజేపీ 44, కాంగ్రెస్ 8, ఆప్ ఒక స్థానాన్ని గెలుచుకుంది. కర్మసాద్, ఆనంద్, గాంధీ ధామ్, నడియాడ్, నవసారి పట్టణాలను బీజేపీ దాదాపుగా క్లీన్ స్వీప్ చేసుకొచ్చింది. పోర్ బందర్, మోర్బి, సురేంద్ర నగర్, మొహసానా, వాపి కార్పొరేషన్లను కూడా బీజేపీ గెలుచుకుంది.ఇక? పంచాయతీల్లో కూడా బీజేపీ స్పష్టమైన మెజారిటీని చూపించింది. ధోరాజి, జేత్‌పూర్, గోండల్, కోట్డా సంగని, లోధికా, పద్ధారి, జస్‌దన్, వింఛియా మరియు జమ్‌కండోర్నలతో సహా, చాలా వరకు పంచాయతీలలో బీజేపీ గెలిచింది. 34 పంచాయతీల్లో 1090 స్థానాలుంటే, బీజేపీ 568 స్థానాలను గెలుచుకోగా, కాంగ్రెస్ 77, ఇతరులు 30 స్థానాల్లో గెలిచారు. 260 తాలూకా పంచాయతీల్లో 5234 స్థానాలుంటే బీజేపీ 2397 స్థానాలను దక్కించుకుంది. అలాగే కాంగ్రెస్ 591, ఇతరులు 329 స్థానాలను గెలుచుకున్నారు.

## దుర్గ ఆలయం మహిళల బాత్ రూమ్ యువకుడి చొరబాటు
## చితకబాదిన సెక్యూరిటీ సిబ్బంది



విజయవాడ విజయవాడ ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో ఒ యువకుడు మహిళల బాత్రూంలోకి చొరపడ్డాడు. హోమండపంలోని 6వ అంతస్థులో మహిళల బాత్రూంలోకి చొరపడి ఫోన్లో మహిళలు స్నానం చేసే దృశ్యాలు నరేష్(20) రికార్డు చేసాడు. ఇది గమనించిన మహిళలు కేకలు వేసారు. మహిళా సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని.. నరేష్ని పట్టుకుని చితకబాదారు. పోలీసులు అతడిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లారు. నరేష్ విజయవాడలోని చిట్టినగర్ ప్రాంతంలో నివాసం ఉంటాడని గుర్తించారు.

# రేషన్ కార్డుల పునః పరిశీలన..!

# ఐటీఆర్ ఫైల్ చేసిన లబ్ధిదారుల్లో ఆందోళన..!

చిరు వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు, స్వయం ఉపాధి వర్గాల్లో అనిశ్చితి...!తెలంగాణలో రేషన్ కార్డుల పునఃపరిశీలన ప్రక్రియ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. క్షేత్రస్థాయిలో అధికారులు చేపడుతున్న తనిఖీలు, ఆదాయ ప్రమాణాల ఆధారంగా అర్హతల పరిశీలన, ఇప్పటికే గణనీయ సంఖ్యలో కార్డుల తొలగింపు పరిణామాలు లబ్ధిదారుల్లో ఆసక్తితో పాటు ఆందోళనను కూడా కలిగిస్తున్నాయి. ముఖ్యంగా చిన్న వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు, స్వయం ఉపాధి వర్గాల్లో అనిశ్చితి కనిపిస్తోంది. రేషన్ కార్డు వ్యవస్థ పేద మరియు తక్కువ ఆదాయం గల కుటుంబాలకు ఆహార భద్రతను అందించే కీలక సంక్షేమ పథకం. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 90 లక్షలకుపైగా కార్డులు అమలులో ఉన్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో అర్హతల పునఃపరిశీలన ప్రక్రియ ప్రారంభమవడం సహజంగానే పెద్ద చర్చకు దారితీసింది.ప్రభుత్వం దృష్టిలో ఈ చర్యల ఉద్దేశం సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజంగా అర్హులకే చేరేలా చూడడం. డూప్లికేట్ ఎంట్రీలు, ఆదాయ మార్పులు, అనర్హ కార్డులను గుర్తించడం ద్వారా వ్యవస్థలో పారదర్శకత పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆదాయానికి సంబంధించిన సూచికలుగా ఐటీ రిటర్న్స్ వంటి ఆధారాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం.అయితే, ఐటీ రిటర్న్ దాఖలు చేయడం ఒక్కటే అధిక ఆదాయం ఉన్నదనే సూచిక కాదన్న వాదన వినిపిస్తోంది. బ్యాంకు రుణాలు, ఉద్యోగ అవసరాలు, పన్ను రీఫండ్ వంటి కారణాలతో తక్కువ ఆదాయం గల వ్యక్తులు కూడా రిటర్న్స్ దాఖలు చేస్తుంటారు. కాబట్టి ఒకే ప్రమాణం ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటే కొన్ని సందర్భాల్లో నిజమైన అర్హులు జాబితా నుంచి తప్పిపోవచ్చున్న ఆందోళన వ్యక్తమవుతోంది.క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిశీలన విధానంపై కూడా కొన్ని ప్రశ్నలు లేవుతున్నాయి. గ్రామ లేదా వార్డు స్థాయిలో అధికారులు డిక్లరేషన్లు తీసుకోవడం, ఆదాయాన్ని అంచనా వేయడం వంటి ప్రక్రియల్లో ప్రాంతానుసారంగా వ్యత్యాసాలు కనిపిస్తున్నాయనే అభిప్రాయాలు ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో ఈ ప్రక్రియ వేగంగా కొనసాగుతుండటంతో ప్రజల్లో అనిశ్చితి పెరిగింది.ఇదే సమయంలో ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను కూడా చేపడతామని ప్రకటించింది. పాత కార్డుల పరిశుభ్రీకరణతో పాటు కొత్త అర్హుల చేర్పు?ఈ రెండు ప్రక్రియలు సమాంతరంగా కొనసాగుతున్నాయి. దీనివల్ల వ్యవస్థను సమతుల్యంగా మార్చే ప్రయత్నం జరుగుతోందని భావించవచ్చు.సంక్షేమ పథకాల నిర్వహణలో మరో ముఖ్యమైన అంశం ఆర్థిక భారం. సబ్సిడీ వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో లీకేజీలను నియంత్రించడం ప్రభుత్వాల ముందున్న ప్రధాన సవాలు. ఈ దృష్టితో అర్హతల పునఃపరిశీలన అవసరమనే అభిప్రాయం కూడా ఉంది. అయితే, ఈ ప్రక్రియలో "ఎక్స్‌క్లూజన్ ఎరర్" అంటే అర్హుల తొలగింపు జరగకూడదన్నది నిపుణుల సూచన.ఇలాంటి సందర్భాల్లో కొన్ని జాగ్రత్తలు అవసరం. కార్డు రద్దు ముందు లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వడం, వివరణకు అవకాశం కల్పించడం, అప్పీల్ వ్యవస్థను అందుబాటులో ఉంచడం వంటి చర్యలు పారదర్శకతను పెంచుతాయి. అదేవిధంగా, అర్హతల నిర్ధారణలో ఆదాయం మాత్రమే కాకుండా జీవన ప్రమాణాలు, ఆస్తులు, సామాజిక పరిస్థితులు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.మొత్తానికి, రేషన్ కార్డు పునఃపరిశీలన ప్రక్రియ ఒక పరిపాలనా అవసరంగా కనిపించినప్పటికీ, దాని అమలు విధానం కీలకం. అనర్హులను గుర్తించడం ఎంత ముఖ్యమో, అర్హులకు నష్టం జరగకుండా చూడడం అంతే ముఖ్యమైనది. పారదర్శకత, స్పష్టత, సమగ్ర పరిశీలన ఈ మూడు అంశాలు సమతుల్యంగా అమలైతేనే ఈ ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.

## ఆవేశంతో భార్య ప్రాణాలు తీసిన భర్త

హైదరాబాద్ మీర్‌పేట్‌లో దారుణం చోటుచేసుకుంది. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెను కత్తితో హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.., నల్గొండ జిల్లా మర్రిగూడెం మండలం శివన్నగూడెంకు చెందిన నరసింహ (60) తన భార్య వసంతతో కలిసి బీఎన్ రెడ్డి నగర్ టీచర్స్ కాలనీలో నివసిస్తున్నాడు. భార్యకు వివాహేతర సంబంధం ఉందని అనుమానంతో బుధవారం తెల్లవారుజామున కత్తితో మెడపై దాడి చేశారు. దీంతో వసంతకు తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రైలులో వివాహితపై దాడి నిందితుడి కోసం పోలీసుల గాలింపు

పల్నాడు రెంటచింతల మండలానికి చెందిన ఓ వివాహితపై విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో లైంగిక దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జీవనోపాధి కోసం విశాఖలో ఉంటున్న బాధితురాలు ఈ నెల 26న నడికుడి వైపు ప్రయాణిస్తుండగా.., జనరల్ బోగీలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ఆమెను ఏసీ బోగీకి తీసుకెళ్లి దాడికి పాల్పడినట్లు సమాచారం. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల భేటిలో పాల్గోన్న మంత్రి పొన్నం

హనుమకొండ జిల్లా, హుస్నాబాద్ నియోజకవర్గం ములకనూరు?భీమదేవరపల్లి మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు అంశాలపై దిశానిర్దేశం చేసారు. రైతులకు ధాన్యం కొనుగోలు సమయంలో పూర్తి సహకారం అందించాలి, గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి అని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచడం, వర్షాకాలంలో మొక్కల నాటకం, గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహణపై దృష్టి పెట్టాలని తెలియజేసారు. ఓటర్ల నమోదు పారదర్శకంగా జరగాలి, గ్రామ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని ఆదేశాలు ఇచ్చారు.

# అదనపు విద్యుత్.. అరకొర ధర

ముంబై, ఏప్రిల్ 29, (న్యూస్ పల్స్) భారతదేశం 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే ప్రతిష్టాత్మక లక్ష్యంతో ముందుకు సాగుతోంది. అయితే, ఈ పచ్చని కల వెనుక విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. నిబంధనల ప్రకారం సోలార్ విద్యుత్‌ను తప్పనిసరిగా కొనాల్సిన డిస్కంలు, తీరా వాడుక సమయంలో డిమాండ్ లేకపోవడంతో ఆ విద్యుత్‌ను ఎక్స్ఛేంజీల్లో కారుచౌకగా అమ్ముకోవాల్సి వస్తోంది. సాధారణంగా యూనిట్ రూ. 2 నుంచి రూ. 3.50 వెచ్చించి కొనుగోలు చేస్తుంటే, మార్కెట్లో కేవలం 50 పైసలకే విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది.దేశంలో అతిపెద్ద విద్యుత్ ఎక్స్ఛేంజ్ అయిన ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ గణాంకాల ప్రకారం.. గరిష్టంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తి అయ్యే మధ్యాహ్నం వేళల్లో యూనిట్ ధర ఒక్కోసారి రూ. 0.50 పైసలకు పడిపోతోంది. డిస్కంలు దీర్ఘకాలిక ఒప్పందాల ద్వారా ఈ విద్యుత్‌ను రూ. 3 పైనే వెచ్చించి సేకరిస్తాయి. ఒకవేళ ఎక్స్ఛేంజీలో అమ్మకపోతే ఆ విద్యుత్ వృథా అవుతుంది, కాబట్టి "ఏమీ రాకపోవడం కంటే.. రూపాయి వచ్చినా చాలు" అనే ధోరణితో డిస్కంలు ఈ నష్టదాయక వ్యాపారాన్ని సాగిస్తున్నాయి.ఈ సంక్షోభం వెనుక ప్రధానంగా 'పునరుత్పాదక కొనుగోలు బాధ్యత' అనే నిబంధన ఉంది. దీని ప్రకారం ప్రతి డిస్కం తాము పంపిణీ చేసే విద్యుత్‌లో కొంత శాతాన్ని తప్పనిసరిగా సౌర లేదా పవన విద్యుత్ రూపంలోనే సేకరించాలి. రాబోయే ఐదేళ్లలో ఈ లక్ష్యం 43 శాతానికి పెరగనుంది. దీనివల్ల అవసరం లేకున్నా డిస్కంలు విద్యుత్‌ను కొనాల్సి వస్తోంది."దేశంలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెరుగుతోంది కానీ, దాన్ని నిల్వ చేసే బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు ఇంకా అందుబాటులోకి రాలేదు. అందుకే మధ్యాహ్నం వేళల్లో ఉత్పత్తి అయ్యే భారీ విద్యుత్‌ను ఏం చేయాలో పాలుపోక ఎక్స్ఛేంజీల్లో విక్రయిస్తున్నారు" అని ఇండియన్ గ్యాస్ ఎక్స్ఛేంజ్ ( ఎండీ రాజేష్ మెడిరట్టా విశ్లేషించారు.భారతదేశంలో ప్రస్తుతం గ్రిడ్ స్థిరత్వం కోసం బ్యాటరీ స్టోరేజ్‌తో కూడిన విద్యుత్ ధర యూనిట్‌కు సగటున రూ. 5 వరకు ఉంది. ఇది డిస్కంలకు భారంగా మారుతోంది. మరోవైపు గత ఏడాది మే నెలలో భారీ వర్షాల కారణంగా డిమాండ్ తగ్గి, విద్యుత్ ధర ఎక్స్ఛేంజీల్లో సున్నాకు పడిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి.ఇప్పటికే దేశవ్యాప్తంగా డిస్కంలు సుమారు రూ. 6 లక్షల కోట్ల రుణ భారంతో సతమతమవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ డిస్కంల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. గ్రీన్ ఎనర్జీ లక్ష్యాలను అందుకోవాలనే తొందరలో డిమాండ్‌ను సరిగ్గా అంచనా వేయకుండా చేస్తున్న కొనుగోళ్లు ఈ అప్పులను మరింత పెంచుతున్నాయి.కేవలం సోలార్ ప్యానెల్స్ పెంచుకుంటూ పోతే సరిపోదు. వ్యవసాయ రంగానికి ఇచ్చే విద్యుత్ సరఫరాను పగటిపూటకి మార్చడం, థర్మల్ ప్లాంట్లను అవసరానికి తగ్గట్టుగా నియంత్రించడం వంటి నిర్మాణాత్మక మార్పులు చేయాలి" అని హెక్సా క్లైమేట్ సొల్యూషన్స్ చైర్మన్ సంజీవ్ అగర్వాల్ సూచించారు.విద్యుత్ రంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. 'టైమ్ ఆఫ్ ది డే'టారిఫ్ విధానం దీనికి సరైన పరిష్కారం. అంటే సౌర విద్యుత్ సమృద్ధిగా దొరికే పగటి వేళల్లో తక్కువ ధరకే వినియోగదారులకు విద్యుత్ అందించి, డిమాండ్ ఎక్కువగా ఉండే సాయంత్రం వేళల్లో రేట్లు పెంచడం. దీనివల్ల డిమాండ్ మేనేజ్మెంట్ సులువవుతుంది. అలాగే, రాష్ట్రాల అవసరాలను బట్టి నిబంధనల్లో వెసులుబాటు కల్పించాలని మాజీ విద్యుత్ శాఖ కార్యదర్శి అలోక్ కుమార్ అభిప్రాయపడ్డారు.

# కలకలం రేపుతున్న వెంబూ లెటర్

తిరువనంతపురం, ఏప్రిల్ 29 జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వేంబు అమెరికాలో స్థిరపడిన భారతీయులకు కీలకమైన పిలుపునిచ్చారు. అమెరికాలో స్థిరపడిన భారతీయులు తమ భవిష్యత్తు గురించి పునరాలోచించి, భారత్ కి తిరిగి రావాలని ఎక్స్ మాధ్యమంగా కీలక పిలుపునిచ్చారు.అమెరికాలో నివసిస్తున్న భారతీయులను ఉద్దేశించే ఈ లేఖ రాశారు. ప్రస్తుతం ఇది వైరల్ అవుతోంది. దేశానికి తిరిగి వచ్చి, భారత అభివృద్ధికి అన్ని విధాలా తోడ్పడాలని పిలుపునిచ్చారు. దశాబ్దాల క్రితం తాను అమెరికాకు వలస వెళ్లిన సొంత అనుభవాన్ని ఆ లేఖలో రాసుకొచ్చారు. ఆ దేశం ఒకప్పుడు అనేక అవకాశాలను ఇచ్చిందన్నారు. అదే సమయంలో వలసు, ఉద్యోగాల విషయంలో ప్రస్తుతం పరిస్థితులు మారిపోతున్నాయని, రాజకీయ పరిస్థితులు, ఇతరత్రా విషయాలు భారతీయులను క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయులు సాంకేతికత రంగంలో, ఇతరత్రా రంగాల్లో సొంతంగా ఎదగడంతోనే భారత్ గౌరవం ప్రపంచ వ్యాప్తంగా మరింత పెరుగుతుందని, దీనితోనే అంతా ముడిపడి వుందని పేర్కొన్నారు. అలాగే ఆయా రంగాల్లో వున్న నిపుణులు స్వదేశానికి తిరిగి వచ్చి, భారత్ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు.అమెరికాలోని భారతీయులకు బహిరంగ లేఖ. ప్రియమైన భారత సోదర సోదరీమణులారా? 37 సంవత్సరాల క్రితం నేను వచ్చినట్లే, మీరు కూడా డబ్బు లేకుండా, మంచి విద్యతో, భారత సాంస్కృతిక వారసత్వంతో అమెరికాకు వచ్చారు. మీరు అద్భుతమైత విజయం సాధించారు.అమెరికా మనకు ఎంతో మేలు చేసింది.అందుకు మనం కృతజ్ఞతతో ఉండాలి ? కృతజ్ఞత మన భారతీయ నైజం.భారతీయులు మన ఉద్యోగాలు లాగేసుకుంటున్నారని అమెరికన్లు చాలా మంది అనుకుంటున్నారు. మన విజయం అన్యాయమైన విజయంగా వారు భావిస్తున్నారు.వచ్చే ఎన్నికలు దీన్ని సరిచేస్తాయని మీరు అనుకోవచ్చు, కానీ మీ ఎంపిక మన భారతీయ నాగరికతను ద్వేషించే వారికి, నాగరికతనే ద్వేషించే వారికి మధ్య ఉంటుంది. రైటిస్టులు, లెఫ్టిస్టులు మధ్య వుంటుంది. ఇందులో మీరు ప్రేక్షకులు మాత్రమే.అయితే.. ఓ విషయం మాత్రంనిజం. ప్రపంచ వ్యాప్తంగా భారతీయులకు లభించే గౌరవం ఎక్కువగా భారత దేశపు తలరాతపైనే ఆధారపడి వుంటుంది. భారత్ పేద దేశంగానే వుండిపోతే, వామపక్ష మేధావులు మనకు నైతిక ఉపన్యాసాలిస్తారు. రైట్ వింగ్ వారు ఉపన్యాసాలిస్తారు.ఇదేదో మర్యాద అన్న భ్రమలో మనం వుండొద్దు. ఈ ప్రపంచంలో శ్రేయస్సు, భద్రతతో పాటు గౌరవం కూడా కావాలి. ఇవన్నీ ఒకే ఒక మూలం నుంచి వస్తాయి. అదే సాంకేతికత నైపుణ్యం. ఆ నైపుణ్యాన్ని సాధించడానికి భారత్ తగినంత మేధోశక్తిని ఉత్పత్తి చేస్తుంది. కానీ ఎక్కువ శాతం మనం అమెరికాకి ఎగుమతి చేసేశాం. ఇది చాలా బాధాకరం. భారత్ లో మనం నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ పోతే, మన నాగరికత బలం కూడా తన ఉనికిని చాటుతుంది. ఇది ఊహించడం కష్టమే అయినా.. మీరందరూ స్వదేశానికి తిరిగి రండి. భారత మాతకు మీ ప్రతిభ ఎంతో అవసరం" అంటూ శ్రీధర్ వెంబూ రాసుకొచ్చారు.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ పై రకరకాల వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో శ్రీధర్ వెంబు ఈ లేఖ రాసుకొచ్చారు. భారత్, చైనా నరక కూపాలని, ఈ దేశాల నుంచి వచ్చే వలసదారులు ల్యాప్ టాప్ గూండాలు అంటూ తీవ్రంగా విమర్శించిన విషయం తెలిసిందే.


## ఢిల్లీ జైళ్ల సిబ్బందికి ప్రవేశ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన తెలంగాణ డీజీపీ

హైదరాబాద్ ఢిల్లీ జైళ్ల సిబ్బందికి నిర్వహిస్తున్న ప్రాథమిక ప్రవేశ శిక్షణ కార్యక్రమాన్ని ఈరోజు చంచల్గూడలోని స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (సికా)లో తెలంగాణ డీజీపీ . శివధర్ రెడ్డి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనను డా. సౌమ్య మిశ్రా, డైరెక్టర్ జనరల్, జైళ్లు ఒ సంస్కరణ సేవలు, ఇతర ఉన్నతాధికారులు మరియు సికా అధ్యాపకులు సాదరంగా ఆహ్వానించారు.

ఈ శిక్షణ కార్యక్రమం రాష్ట్రాల మధ్య సమన్వయం మరియు సంస్కరణ పరిపాలనలో పరస్పర సహకారానికి ప్రతీకగా నిలుస్తోంది. 2026 సంవత్సరంలో మొత్తం 381 మంది ఢిల్లీ జైళ్ల సిబ్బంది దశలవారీగా శిక్షణకు ఎంపికయ్యారు. నేడు ప్రారంభమైన మొదటి దశలో 62 మంది శిక్షణార్థులు పాల్గొంటున్నారు. వీరిలో 61 మంది ఢిల్లీ జైళ్ల శాఖకు చెందినవారు, 1 తెలంగాణ జైళ్ల శాఖ వార్డర్ ఉన్నారు.

జైలు నియమాలు, క్రిమినాలజీ, విక్టిమాలజీ ఒ పెనాలజీ, సైకాలజీ, సోషియాలజీ ఒ సోషల్ వర్క్, క్రిమినల్ చట్టాలు, రాజ్యాంగ విలువలు ఒ మానవ హక్కులు, జైలు పరిపాలనలో సాంకేతికత, బాహ్య శిక్షణ (శారీరక ఒ మానసిక దృఢత్వం): శారీరక వ్యాయామం, బిపిఆర్ ఒ డి ప్రమాణాల ప్రకారం పరేడ్, యోగా ఒ ధ్యానం లో శిక్షణ ఇస్తారు.డీజీపీ. శివధర్ రెడ్డి మాట్లాడుతూ జైళ్ల శాఖ పాత్ర సమాజానికి అత్యంత ముఖ్యమని, ఇది సులభమైన పని కాదని పేర్కొన్నారు. జైలు సేవ అనేది కేవలం నాలుగు గోడల మధ్య తాళాలు వేసే పని కాదని, అది ఖైదీలను సరిదిద్దుతూ సమాజంలో తిరిగి కలిపే బాధ్యత అని చెప్పారు. శిక్షణార్థులు క్రమశిక్షణ, నిష్పక్షపాతిత్వం మరియు వృత్తిపరమైన నైపుణ్యాలను పాటిస్తూ ఖైదీలను గౌరవంతో చూడాలని సూచించారు. వారికి తన శుభాకాంక్షలు తెలియజేశారు.

# నాటి చంద్రబాబు కాదా...



విజయవాడ, ఏప్రిల్ 29, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెతక వైఖరిని అవలంబిస్తున్నారు. గతంలో అధికారుల విషయంలో కఠినంగా వ్యవహరించేవారు. పార్టీ నేతలు కూడా క్రమశిక్షణతో మెలిగేవారు. కానీ ఎందుకో.. ఏమో..తెలియదు కానీ చంద్రబాబులో చాలా మార్పు కనిపిస్తుంది. పార్టీ నేతల సంగతి పక్కన పెడితే అధికారులపై కూడా అజమాయిషీ లేకుండా పోయింది. సమీక్షల్లో సీరియస్ అనే మాటలను వినటమే కానీ.. కనీసం సమస్యకు కారణమయిన వారిపై ఎలాంటి చర్యలకు దిగకపోవడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. చంద్రబాబు తాను అధికారంలోకి వచ్చిన వెంటనే తనలో 1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తానని ప్రకటించారు.1995 నాటి ముఖ్యమంత్రి మాటేమో కానీ, కనీసం 2014 నాటి ముఖ్యమంత్రి కూడా కనిపించడం లేదన్న కామెంట్స్ ఇప్పుడు కార్యకర్తల్లో ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఎందుకంటే గత వారం రోజుల నుంచి ఆంధ్రప్రదేశ్ లో పెట్రోలు, డీజిల్ కొరత సమస్య ఉందని తెలిసినప్పటికీ అధికారుల ఉదాసీన వైఖరిని ఆయన ప్రశ్నించలేకపోతున్నారు. అదే సమయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ అంటూ నిత్యం పరితపించే చంద్రబాబు ఇంత జరుగుతున్నా అది ఏం చేస్తుందన్న దానిపై కూడా నాయుడు పెదవి విప్పకపోవడం చర్చనీయాంశమైంది. నిజానికి చంద్రబాబు అధికారులను అలా ఊరికే వదిలేసే రకం కాదు. ఇరవై నాలుగు గంటలు వెంటపడి పనులు చేయించుకుంటారన్న పేరు ఆయనకు గతంలో ఉండేది.కానీ 2024 తర్వాత మాత్రం చంద్రబాబు నాయుడు పూర్తిగా మారిపోయారు. ఎంతగా మారిపోయారంటే.. ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టడం వంటి వాటికే సరిపెట్టారు. అందులో ఎక్కువగా తన విజన్ తో పాటు తన పూర్వ విషయాలను చెప్పుకోవడమే సరిపోతుంది. అంతేతప్ప క్షేత్రస్థాయిలో జరుగుతున్న లోపాలు సరిదిద్దలేకపోవడం, సక్రమంగా హెచ్చరికలు జారీ చేయకపోవడం వల్లనే ఇటువంటి పరిస్థితులు తలెత్తాయని అంటున్నారు. చంద్రబాబుకు కూడా పెట్రోలు, డీజిల్ కొరత సమస్యను చెప్పకుండా దాచి పెట్టారంటే చంద్రబాబు ఇచ్చిన అలుసు మాత్రమేనని చెప్పాలి. మరి చంద్రబాబు ఇప్పటికైనా మారాలని కోరుకుంటున్నారు.

## మద్యం మత్తులో కారు డ్రైవింగ్ అదుపు తప్పిన కారు.. మూడు వాహనలు ధ్వంసం

హయత్ నగర్ ఫూటుగా మందుకొట్టి.. ఒళ్ళుతెలియని స్థితిలో కారు నడుపుతూ బీభత్సం సృష్టించారు. హయత్ నగర్ లోని ఇంజాపూర్ ఘటన జరిగింది. అదుపు తప్పిన కారు పార్కింగ్ చేసిన మూడు బైకుల పైకి దూసుకొచ్చింది. మూడు బైకులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. కారు అతివేగంగా వస్తుండడంతో వాహనదారులు, స్థానికులు పక్కకు పరుగులు తీసారు. కారు నడిపిన యువకుడు..కారులో ఉన్న మరో ఇద్దరు యువకులు కూడా మద్యం మత్తులో ఒళ్లు తెలియని స్థితిలో ఉన్నట్లు స్థానికులు పోలీసులు గుర్తించారు. పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు వున్నారు. కారు ప్రమాద దృశ్యాలు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల్లో నమోదు అయ్యాయి.

# కేటీఆర్ వర్సెస్ కవిత



హైదరాబాద్ ఏప్రిల్ 29, కల్వకుంట్ల కుటుంబంలో వారసత్వ పోరు ఇప్పుడు కీలకదశకు చేరు?ంది. కేసీఆర్ వారసులలో ఎవరు సమర్థులు కేటీఆర్ నా..కవితనా ?. కేటీఆర్.. మగపిల్లాడే వారసుడు అనే అడ్వాంటేజ్ తీసుకుని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిపోయారు. ఆయన నాయకత్వాన్ని మొదట కవిత కూడా అంగీకరించారు. కానీ తనకు అసలు రాజకీయ భవిష్యత్తే లేకుండా చేయాలనుకోవడంతో కవిత తన దారి తాను చూసుకున్నారు. ఆమె సొంత రాజకీయాలు ప్రారంభించడంతో నిజంగా ఇద్దరిలో ఎవరు రాజకీయంగా సమర్థులు అనే ప్రశ్న వస్తోంది.బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత పార్టీని గాడిలో పెట్టడంలో కేటీఆర్ ఆశించిన స్థాయిలో సఫలం కాలేదనే అభిప్రాయం బలంగా ఉంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, పార్టీ నుంచి కీలక నేతల వలసలు ఆయన నాయకత్వ వైఫల్యానికి అద్దం పడుతున్నాయి. కేసీఆర్ మళ్లీ క్రియాశీలక బాధ్యతలు తీసుకోవాలని .. పార్టీని గాడిలో పెట్టాలని కేడర్ కోరుకోవడమే కేటీఆర్ వైఫల్యానికి నిదర్శనమని చెబుతున్నారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఢీకొట్టే విషయంలో పెద్దగా ఆకట్టుకోలేకపోవడం?ప్రజా సమస్యలపై కంటే కేవలం సోషల్ మీడియా విమర్శలకే పరిమితం కావడం ఆయన రాజకీయ పరిణతిని ప్రశ్నించేలా చేశాయి.కవిత తన రాజకీయ అస్తిత్వం కోసం అత్యంత తెలివైన పావులను కదిపారు. బీఆర్ఎస్ వదులుకున్న తెలంగాణ, టీఆర్ఎస్ సెంటిమెంట్‌ను ఆమె మళ్లీ అందిపుచ్చుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భావ సభకు తరలివచ్చిన జనసందోహం, ఆమె మాటల్లోని స్పష్టత రాజకీయ వర్గాలను మెప్పించాయి. తండ్రి, సోదరుడిపై నేరుగా విమర్శలు చేస్తూనే, బీఆర్ఎస్ తన ఆత్మను కోల్పోయిందని, తాను మళ్లీ సామాజిక తెలంగాణ ఆశయాలను మోస్తానని చెప్పడం ద్వారా ఆమె బీఆర్ఎస్ ఓటు బ్యాంకుపై గట్టిగా గురిపెట్టారు.ఇప్పటివరకు జరిగిన పరిణామాలను బట్టి చూస్తే, రాజకీయ ఎత్తుగడల్లో కేటీఆర్ కంటే కవితే కాస్త ముందున్నట్లు కనిపిస్తోంది. కేటీఆర్ కేవలం పార్టీ పదవిని వారసత్వంగా స్వీకరిస్తే, కవిత మాత్రం ప్రతికూల పరిస్థితుల్లో కూడా తనదైన శైలిలో పబ్లిసిటీని, జనసమీకరణను నిర్వహించి ఇంపాక్ట్ సృష్టించగలిగారు. బీఆర్ఎస్‌ను డూప్లికేట్ అని పిలిచే స్థాయికి ఆమె తన కొత్త పార్టీని తీసుకెళ్లడం ఆమె రాజకీయ చతురతకు నిదర్శనం. నియోజకవర్గ స్థాయి నేతలను ఆకర్షించడంలో, ముఖ్యంగా బీఆర్ఎస్‌లో వివక్షకు గురైన వారిని చేరదీయడంలో ఆమె వేగం పెంచారు.కవిత సృష్టించిన ఈ ఇంపాక్ట్ బీఆర్ఎస్‌కు పెనుగండంగా మారే అవకాశం ఉంది. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చీలితే అది పరోక్షంగా అధికార కాంగ్రెస్ లేదా బిజెపికి లాభం చేకూరుస్తుందా? లేక కవిత నిజంగానే మూడవ ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందా? అన్నది ఉత్కంఠ రేపుతోంది. కేటీఆర్ ఇప్పటికైనా తన శైలిని మార్చుకుని పార్టీని కాపాడుకుంటారా, లేక కవిత సృష్టించిన ఈ సునామీలో బీఆర్ఎస్ తన ప్రాభవాన్ని పూర్తిగా కోల్పోతుందా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# ‘గాయపడ్డ సింహం’ పెద్ద సక్సెస్ తో మెమొరబుల్ ఫిల్మ్ కావాలని కోరుకుంటున్నాను: ప్రీరిలీజ్ విసా స్టాపింగ్ ఈవెంట్ లో హీరో నారా రోహిత్

## 'గాయపడ్డ సింహం' సినిమా అద్భుతంగా వచ్చింది. ఇందులో నా కోసం క్రియేట్ చేసిన క్యామియో రోల్ యూనిక్ టైమింగ్ తో ఉంటుంది: కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీవిష్ణు




డిఫరెంట్ ఎంటర్టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్- డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి ‘గాయపడ్డ సింహం’ తో అలరించబోతున్నారు. ఈ చిత్రంలో హీరో శ్రీవిష్ణు స్పెషల్ రోల్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని పవన్ సాదినేని సమర్పణలో, కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ సప్తస్వ మీడియా వర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్ల పై నిర్మించారు. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటించారు. జేడి చక్రవర్తి కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసింది. గాయపడ్డ సింహం మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ విసా స్టాపింగ్ ఈవెంట్ నిర్వహించారు.

ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో నారా రోహిత్ మాట్లాడుతూ. “అందరికీ నమస్కారం. ‘గాయపడ్డ సింహం’ టీమ్‌కి కంగ్రాచులేషన్స్. అందరికీ చాలా పెద్ద సక్సెస్ రావాలని కోరుకుంటున్నాను. ఇక్కడికి రావడానికి కారణం విజయ్, పవన్ ? వాళ్లిద్దరి కోసం వచ్చాను. విజయ్‌తో నాకు చాలా కాలంగా అసోసియేషన్ ఉంది. అలాగే పవన్‌తో కూడా నేను నెక్స్ట్ సినిమా ఇదే బ్యానర్‌లో చేస్తున్నాను. కళ్యాణ్ గారు, భాను గారు, విజయ్ గారికి ఈ సినిమా ఒక మెమొరబుల్ ఫిల్మ్ అవ్వాలని కోరుకుంటున్నాను. మే 1న అందరూ ఈ సినిమాను థియేటర్లలో చూసి ఎంజాయ్ చేయండి. పైరసీని ఎంకరేజ్ చేయకండి. థాంక్యూ సో మచ్.”

హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ ఈవెంట్‌కు వచ్చిన అందరికీ థాంక్యూ. విప్లవ్ ఎడిటింగ్ ఫెంటాస్టిక్‌గా ఉంటుంది. స్వీకర్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. పాటలు చాలా బాగున్నాయి, బీజీఎమ్ అదిరిపోయింది. మానస నా సినిమాలో క్యామియో చేసింది కాబట్టి, నేను కూడా తన సినిమాలో చేశాను (నవ్వుతూ). డైరెక్టర్ కశ్యప్‌కి ప్రత్యేకమైన టైమింగ్ ఉంది. ఆ టైమింగ్‌ను ఈ సినిమాలో బాగా వాడుకున్నారని అనుకుంటున్నాను. చాలా అద్భుతంగా వచ్చింది. చిన్నప్పటి నుంచి జేడీ గారి సినిమాలు చూస్తూ పెరిగాం. ఆయన ఇంకా మరిన్ని సినిమాలు చేసి మమ్మల్ని ఇన్‌స్పైర్ చేయాలి. ఈ సినిమాలో నేను చేయడానికి ఒక కారణం నారా రోహిత్ గారు కూడా. ఆయన నా సినిమాల్లో చాలాసార్లు క్యామియో చేశారు (నవ్వుతూ). పవన్ సాదినేని డైరెక్ట్ చేస్తున్నప్పుడు మొదటి హీరోగా నేనే చేశాను. ఇప్పుడు ఆయన ప్రొడ్యూస్ చేస్తున్నప్పుడు కూడా నేను చేయడం ఆనందంగా ఉంది. విజయ్, భాను, కళ్యాణ్ ? వీరంతా నా క్లోజ్ ఫ్రెండ్స్. వాళ్ల కోసం నా వంతు కాంట్రిబ్యూషన్‌గా ఈ సినిమా చేశాను. ఈ ఈవెంట్‌కు వచ్చిన దర్శకులందరికీ థాంక్యూ.

జేడీ చక్రవర్తి మాట్లాడుతూ.. అందరికీ హాయ్. ఈ సినిమాకు ఫస్ట్ హీరో పవన్ సాదినేని. ఆయన ఈ సినిమా చేయాలనుకున్నప్పుడు ప్రొడ్యూసర్లు లేరు. నాకు, తరుణ్‌కి చెప్పిన తర్వాత సినిమా స్టార్ట్ చేశాడు. మధ్యలో కొన్ని సమస్యలు వచ్చినా, కశ్యప్ వెనుక నిలబడ్డాడు . ఈ సినిమాలో తరుణ్ భాస్కర్ చేసిన క్యారెక్టర్, ట్రంప్‌తో పెట్టుకున్న గొడవ వల్ల నా క్యారెక్టర్ ఇన్వాల్వ్ అవుతుంది. నాకు తెలియకుండా శ్రీ విష్ణు క్యారెక్టర్ ఎంటర్ అవుతుంది. ఈ సినిమాకి ఒక సమస్య వచ్చింది. ఈ సినిమాలో ట్రంప్ కార్డ్ ఉంది. కశ్యప్ ఇండియా?అమెరికాకు వార్ తీసుకురాగలిగాడు(నవ్వుతూ). శ్రీ విష్ణు అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో కనిపిస్తారు. మీరు హాయిగా నవ్వుకోవాలంటే మే 1న ‘గాయపడ్డ సింహం’ తప్పకుండా చూడండి.

డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ముందుగా నా డైరెక్షన్ డిపార్ట్మెంట్‌కి థాంక్స్. వాళ్లు ఇచ్చిన సపోర్ట్ మామూలుది కాదు. నా గాడ్ బ్రదర్ పవన్ సాదినేని ? నేను భవిష్యత్తులో ఏ విజయాలు సాధించినా, దాని క్రెడిట్ ఆయనకే చెందుతుంది. ఈ వేడుకకు వచ్చిన నారా రోహిత్ గారికి ధన్యవాదాలు. ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరూ ఎంతో డెడికేషన్‌తో వర్క్ చేశారు. టెక్నీషియన్స్ అందరూ బెస్ట్ అవుట్‌పుట్ ఇచ్చారు. మా నిర్మాతలు సినిమా మీద ప్యాషన్ ఉన్న వారు. వాళ్లకు డబ్బులు వస్తే, నా లాంటి వాళ్లకు లైఫ్ వస్తుంది. స్వీకర్ అగస్తి తన బెస్ట్ మ్యూజిక్ ఇచ్చి సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాడు. జేడీ గారు, తరుణ్ ఇచ్చిన సపోర్ట్‌ను ఎప్పటికీ మర్చిపోలేను. ఈ సినిమా నాకు మంచి ఫ్రెండ్స్‌ను ఇచ్చింది. ఇందులో ట్రంప్ ఎలిమెంట్‌ను వినియోగించాం. శ్రీ విష్ణు గారి ఇంపాక్ట్ చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. ఆయన ఈ సినిమాలో భాగం కావడం మా అదృష్టంగా భావిస్తున్నాను.

హీరోయిన్ ఫారియా అబ్దుల్లా మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. నిర్మాతలు ఎంతో ప్యాషన్‌తో, క్రియేటివ్‌గా ఈ సినిమాను తీశారు. మొత్తం టీమ్‌కి ధన్యవాదాలు. ఇందులో నాకు మంచి వైబ్ ఉన్న పాత్ర దక్కింది. డైరెక్టర్ కశ్యప్ గారు అద్భుతంగా తెరకెక్కించారు. ఆయన సెన్స్ ఆఫ్ హ్యూమర్ అదిరిపోతుంది. మానస ఈ సినిమాలో చాలా క్యూట్‌గా కనిపిస్తుంది. ఈ చిత్రంలో పనిచేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. మీరు ఆశించిన దానికంటే ఎక్కువ ఎంటర్టైన్మెంట్ ఈ సినిమా ఇస్తుంది. శ్రీ విష్ణు గారు ఈ సినిమాలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది.”

హీరోయిన్ మానస చౌదరి మాట్లాడుతూ.. ప్రేక్షకులందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు. ఈ వేడుకకు విచ్చేసిన దర్శకులకు, నారా రోహిత్ గారికి, శ్రీవిష్ణు గారికి ధన్యవాదాలు. మా నిర్మాతలందరికీ థాంక్స్. తరుణ్ భాస్కర్ గారు నా ఫేవరెట్ డైరెక్టర్. ఇందులో ఆయన పెర్ఫార్మెన్స్ మీ అందరికీ ఖచ్చితంగా నచ్చుతుంది. జేడీ గారు ఈ సినిమాకు మంచి వైబ్ తీసుకొచ్చారు. ఫారియా యాక్టింగ్‌తో పాటు డాన్స్ కూడా చాలా క్యూట్‌గా ఉంటుంది. డైరెక్టర్ కశ్యప్ గారు సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ప్రతి సీన్‌లో ఫన్ ఉంటుంది. కడుపుబ్బ నవ్వుకుంటూ బయటికి వస్తారు. మ్యూజిక్ డైరెక్టర్ స్వీకర్ అగస్తి మాట్లాడుతూ... నన్ను ఈ ప్రాజెక్ట్‌లోకి తీసుకువచ్చిన భాను గారికి థాంక్స్. ఇలాంటి కమర్షియల్ సినిమా కోసం చాలా రోజులుగా ఎదురుచూస్తున్నాను. మా నిర్మాతలందరికీ ధన్యవాదాలు. డైరెక్టర్ కశ్యప్ గారు నాకు ఈ సినిమా కోసం చాలా కాన్ఫిడెన్స్ ఇచ్చారు. ఆయన టైమింగ్ అద్భుతంగా ఉంటుంది. మా మ్యూజిక్ టీమ్ అందరికీ థాంక్స్. శ్రీ విష్ణు గారి డబ్బింగ్ కోసం మేము ఎంతో ఆసక్తిగా ఎదురు చూశాం. ఆయన డబ్బింగ్ వినడానికి మ్యూజిక్ పనులు కూడా ఆపేసి ప్రత్యేకంగా విన్నాం. ఆయన ఈ సినిమాలో భాగం కావడం మాకు చాలా ఆనందంగా ఉంది. ఖచ్చితంగా ఈ సినిమా మీ అందరినీ అలరిస్తుంది.

డైరెక్టర్ శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ...“అందరికీ నమస్కారం. శ్రీ విష్ణు గారు ఈ సినిమా చేయడం చాలా సర్ప్రైజ్‌గా అనిపించింది. కశ్యప్ షార్ట్ ఫిల్మ్స్ చేస్తున్నప్పటి నుంచి తెలుసు. తనకి ఎప్పుడూ అదే ఎనర్జీ ఉంటుంది. ఈ సినిమాతో ఆయన ఒక బ్లాక్‌బస్టర్ హిట్ కొడతారని నమ్ముతున్నాను. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్.”

డైరెక్టర్ సాయి మార్తాండ మాట్లాడుతూ..తరుణ్ భాస్కర్ అన్నకి నేను పెద్ద ఫ్యాన్. నా సినిమాలపై ఆయన ఇన్‌స్పిరేషన్ చాలా ఉంటుంది. కశ్యప్ గారికి ఇది బెస్ట్ డెబ్యూ అవుతుందని నమ్ముతున్నాను. శ్రీవిష్ణు గారు చేయడం చాలా సర్ప్రైజ్ గా అనిపించింది. మే 1న ఈ సినిమా ఖచ్చితంగా పెద్ద హిట్ అవుతుంది.”

డైరెక్టర్ హుస్సేన్ షా కిరణ్ మాట్లాడుతూ.. కశ్యప్ గురించి నాకు చాలా గర్వంగా ఉంది. ట్రైలర్ అద్భుతంగా ఉంది. స్వీకర్ మ్యూజిక్ అదిరిపోయింది. మా ఫ్రెండ్స్ అందరం కలిసి ఈ సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. శ్రీ విష్ణు గారు నా ఫేవరెట్ హీరో. ఆయన ఈ సినిమా చేయడం నాకు చాలా ఆనందంగా ఉంది.”

డైరెక్టర్ హసిత్ గోలి మాట్లాడుతూ.. మేము షార్ట్ ఫిలిమ్స్ చేస్తున్నప్పుడు కశ్యప్ వీడియోస్ కోసం ఎదురు చూసేవాళ్లం. ట్రైలర్‌లో ఆ క్రేజీనెస్ కనిపిస్తోంది. తరుణ్ గారు, జేడీ గారు ఇలా అందరూ కలిసి చేస్తున్న ఈ సినిమా చాలా క్రేజీగా ఉంది. ట్రైలర్ చూసిన తర్వాత మైండ్ బ్లోయింగ్ అనిపించింది. ఇది ‘గాయపడ్డ సింహం’ కాదు? ‘సక్సెస్ రాయబడ్డ సింహం’. మే 1న థియేటర్లలో బ్లాస్ట్ అవుతుంది.

డైరెక్టర్ సందీప్ రాజ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమాతో కశ్యప్ డైరెక్టర్‌గా పరిచయం కావడం చాలా ఆనందంగా ఉంది. మేమిద్దరం యూట్యూబ్ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చాం. ఆయనకు ఆల్ ది బెస్ట్. తరుణ్ అన్న నాకు యాక్టింగ్, డైరెక్షన్ రెండింట్లో ఇన్‌స్పిరేషన్. టీమ్ అందరికీ అడ్వాన్స్ కంగ్రాట్స్.

ప్రొడ్యూసర్ సందీప్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్. కశ్యప్ ఈ సినిమాను అద్భుతంగా తీశాడు. స్వీకర్ అగస్తి మంచి మ్యూజిక్ ఇచ్చాడు. తరుణ్ పెర్ఫార్మెన్స్ చాలా స్పెషల్. ఖచ్చితంగా ఈ సినిమా ఎంజాయ్ చేసేలా వుంటుంది.

# కొండెక్కిన కోడిగుడ్డు ధర



హైదరాబాద్, ఏప్రిల్ 29, ఇటీవల తగ్గినట్లే తగ్గిన గుడ్ల ధరలు.. మళ్లీ పెరుగుతున్నాయి. హైదరాబాద్‌లో కేవలం 15 రోజుల్లోనే గుడ్ల ధరలు భారీగా పెరిగాయి.. ఒక్కో గుడ్డుకు రూ.3 మేర ధర పెరిగింది. కొన్ని రోజుల్లోనే ఆకాశాన్నంటుతున్న గుడ్ల ధరలు వినియోగదారుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. దాదాపు రెండు వారాల క్రితం ఒక గుడ్డు ధర రూ.4 ఉండగా, ఇప్పుడు రిటైల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.7 కి చేరింది. మరికొన్ని ప్రాంతాల్లో 8 రూపాయాలు సైతం అమ్ముతున్నారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా రిటైల్ కిరాణా దుకాణాలలో ధరలు ఒకే విధంగా ఉండగా, హోల్‌సేల్ దుకాణాలు ఒక్కో గుడ్డును రూ. 6.30 చొప్పున అమ్ముతున్నాయి.కోళ్ల అధిక మరణాలు, ఉత్పత్తి తగ్గడం.. డిమాండ్ పెరగడం.. వేగంగా పెరుగుతున్న ధరలకు కారణమని కోళ్ల పెంపకందారులు పేర్కొంటున్నారు. “వేసవిలో, ఫారాలలో కోళ్ల మరణాల రేటు ఎక్కువగా ఉంటుంది. ఉత్పాదకత తక్కువగా ఉంటుంది. అయినప్పటికీ, గుడ్లు, కోళ్ల మాంసానికి డిమాండ్ అలాగే కొనసాగుతుంది. సరఫరా తక్కువగా ఉండటంతో, నష్టాలను పూడ్చుకోవడానికి ఫారాలలో గుడ్లు, కోళ్ల ధరలను పెంచుతారు.” అని రంగారెడ్డి జిల్లాలోని ఒక కోళ్ల ఫారం యజమాని తెలిపారు..సంవత్సరంలోని ఇతర నెలలతో పోలిస్తే వేసవిలో మరణాల రేటు 30 శాతం ఎక్కువగా ఉంటుందని మరో పౌల్ట్రీ ఫారం యజమాని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, మార్కెట్లో కోడి మాంసం ధర కిలోకు రూ.240 ఉండగా, లైవ్ బర్డ్ (బతికున్న కోడి) కిలో రూ.170కి అమ్ముతున్నారు. హైదరాబాద్ లో కేజీ చికెన్ రూ.240 నుంచి రూ.260 వరకు అమ్ముతున్నారు. గత వారం కేజీ చికెన్ రూ.280 నుంచి 300వరకు అమ్మారు.మల్లేపల్లిలోని చికెన్ షాప్ యజమాని మహ్మద్ నజీర్ మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా చికెన్ ధరలు కేవలం కొన్ని రూపాయలు మాత్రమే పెరిగాయని చెప్పారు. “వేసవిలో ప్రజలు వివిధ కారణాల వల్ల చికెన్ కొనడానికి దూరంగా ఉంటారు.. కాబట్టి చిల్లర అమ్మకాల డిమాండ్ తక్కువగా ఉంటుంది. హోటళ్లు, క్యాటరర్లకు జరిగే సాధారణ సరఫరాలకు ఎలాంటి ఆటంకం కలగలేదు,” అని నజీర్ అన్నారు.కోళ్ల ఫారాలు రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అధికంగా ఉన్నాయి.ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం కారణంగా ఎగుమతులు దెబ్బతినడంతో మార్చిలో గుడ్ల ధరలు తగ్గాయి. అయితే, అది స్వల్ప కాలం వరకే కొనసాగింది.. అయితే.. కోళ్ల మరణాలు.. డిమాండ్ పెరగడం వల్ల.. ముమ్మందు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని పౌల్ట్రీ ఓనర్స్ పేర్కొంటున్నారు.

## ఇక 3 గంటల్లో ముంబై

హైదరాబాద్, ఏప్రిల్ 29, హైదరాబాద్ నుంచి ముంబైకు 3 గంటల్లోనే చేరుకోవచ్చు. అవును.. ఈ రెండు ప్రాంతాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మించనున్నారు హైదరాబాద్-పుణె-ముంబై మధ్య హైస్పీడ్ రైలు కారిడార్ రానుందని, దీనికి సంబంధించి ఇప్పటికే డీపీఆర్ కూడా పూర్తయిందని తెలిపారు. దాదాపు 761 కిలోమీటర్ల మేర ఈ రైలు కారిడార్ ఉంటుందని, డీపీఆర్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. ఈ కారిడార్‌పై కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్-ముంబై హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టు పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఇది అందుబాటులోకి వస్తే మూడు గంటల్లోనే రెండు నగరాల మధ్య ప్రయాణించవచ్చని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్, నాగ్‌పూర్ మధ్య వందే భారత్ రైలు అందుబాటులో ఉంది. హైస్పీడ్ రైలు కారిడార్ అందుబాటులోకి వస్తే వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుంది.హైదరాబాద్-ముంబై కారిడార్‌కు సంబంధించి మొత్తం 12 స్టేషన్లు ఉంటాయి. గరిష్టంగా గంటకు 330 కిలోమీటర్ల వేగంతో రైళ్లు ప్రయాణిస్తాయి. ఎలివేటెడ్, అండర్‌గ్రౌండ్ సెక్షన్లను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా వికారాబాద్ సమీపంలో 4.6 కిలోమీటర్ల పొడవైన భారీ టన్నెల్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే హైదరాబాద్ నుంచి ముంబైకు మెరుగైన కనెక్టివిటీ లభించడమే కాకుండా పారిశ్రామికంగా కూడా రాష్ట్రానికి ఉపయోగపడనుంది. ఒక ఎకనామిక్ గ్రోత్ కారిడార్‌గా ఇది ఉంటుంది. ఇక ఫ్యూచర్ సిటీ నుంచి చెన్నై, బెంగళూరు కారిడార్ల పనులపై కూడా కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులతో సమీక్షించారు. ఫ్యూచర్ సిటీ నుంచి చెన్నై, బెంగళూరుకు హైస్పీడ్ రైల్ కారిడార్లు ఉండనున్నాయి.

# కేసీఆర్ రీ లోడింగ్...



హైదరాబాద్, ఏప్రిల్ 29, తెలంగాణ రాజకీయాల్లో మరోసారి విద్యార్థి శంఖారావం వినిపించాలని గులాబీ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు. ఉద్యమ కాలంలో కేసీఆర్ పిలుపుతో ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలు ఎలాగైతే కదిలాయో.. అదే తరహా ఇంటెన్సిటీని ప్రస్తుత రాజకీయ పోరాటాల్లోకి తీసుకురావడమే లక్ష్యంగా బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ప్రత్యక్షంగా రంగంలోకి రాకముందే విద్యార్థి లోకం రహదారులపైకి వచ్చింది. విద్యార్థుల పోరాటమే ఆనాడు రాజకీయ పార్టీలను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇప్పుడు అదే వ్యూహాన్ని కేసీఆర్ మళ్ళీ నమ్ముకున్నారు. ప్రతి కాలేజీలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగ కమిటీలను బలోపేతం చేయాలని, యువతను ఫుల్ టైమ్ పొలిటికల్ వారియర్స్ ‘గా మార్చాలని ఆయన ఆదేశించడం వెనుక ఒక బలమైన కారణం ఉంది. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ యంత్రాంగం కొంత స్తబ్దుగా మారినా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేయాలంటే విద్యార్థుల తెగువ అవసరమని ఆయన గుర్తించారు.అయితే, ఉద్యమ కాలం నాటి సెంటిమెంట్ వేరు, ఇప్పటి రాజకీయ అవసరాలు వేరు. ఆనాడు ప్రత్యేక రాష్ట్రం అనే ఏకైక లక్ష్యం విద్యార్థులను భావోద్వేగంతో ఏకం చేసింది. కానీ నేడు ఉపాధి కల్పన, ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ వంటి అంశాలే విద్యార్థి రాజకీయాలను శాసిస్తున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ వంటి వారి నేతృత్వంలో అసెంబ్లీ ముట్టడి, ఫీజుల బకాయిలపై నిరసనలు చేపడుతూ యాక్టివ్ అవుతున్నారు. కానీ, రాజకీయ ప్రయోజనాల కోసం చేసే పోరాటాలకు విద్యార్థులు ఏ మేరకు స్వచ్ఛందంగా కదులుతారనేది ప్రశ్నార్థకమే. కేసీఆర్ కేవలం నిరసనలకే పరిమితం కాకుండా, యువతకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే దిశగా అడుగులు వేస్తున్నారు. కాలేజీ స్థాయిలోనే నాయకత్వ లక్షణాలు పెంచి, వారిని భవిష్యత్ ఎన్నికల ముఖచిత్రంగా చూపడం ద్వారా కొత్త రక్తాన్ని పార్టీలోకి ఎక్కించాలనుకుంటున్నారు. ప్రభుత్వంపై పోరాడే క్రమంలో విద్యార్థులు ఎదుర్కొనే కేసులను, సమస్యలను పార్టీ అండగా నిలబడి చూసుకుంటుందని భరోసా ఇవ్వడం ద్వారా వారిని యాక్టివ్ మోడ్ లోకి తీసుకురావాలని చూస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విద్యార్థుల్లో ఉన్న చిన్నపాటి అసంతృప్తిని కూడా వదులుకోకూడదని బీఆర్ఎస్ భావిస్తోంది. ప్రత్యేకించి విద్యా రంగానికి కేటాయింపులు, నిరుద్యోగ భృతి వంటి హామీలపై ఉన్న వ్యతిరేకతను విద్యార్థి కమిటీల ద్వారా క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం కేసీఆర్ మాస్టర్ ప్లాన్. విద్యార్థులు రోడ్డెక్కితే అది సృష్టించే ఇంపాక్ట్ మీడియాలోనూ, ప్రజల్లోనూ బలంగా ఉంటుంది. ఇది రాజకీయంగా బీఆర్ఎస్‌కు మళ్లీ పూర్వ వైభవం తీసుకువస్తుందని ఆశిస్తున్నారు. విద్యార్థులను రాజకీయాల కోసం రోడ్లపైకి తీసుకు రావడం కేసీఆర్ లాంటి చతురత కలిగిన నేతకు పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు. కానీ, కేవలం ప్రభుత్వంపై విమర్శలకే పరిమితం కాకుండా, విద్యార్థుల కెరీర్‌కు బీఆర్ఎస్ ఏ రకమైన భరోసా ఇస్తుందనే స్పష్టత ఇవ్వాల్సి ఉంటుంది. రాజకీయ సమీకరణలు మారుతున్న తరుణంలో, ఈ విద్యార్థి కమిటీలు బీఆర్ఎస్‌కు ఏ మేరకు బూస్టర్ డోస్ గా మారుతాయో చూడాలి. ఏది ఏమైనా, కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి సెగ పుట్టించడం ఖాయం అనుకోవచ్చు.

## లిక్కర్ కేసు లో క్లీన్ చిట్ ఎక్కడొచ్చింది

హైదరాబాద్ కవిత పొలిటికల్ పార్టీ స్థాపించడంపై కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసారు..తండ్రి మీద ప్రేమ ఉంటే అలా మాట్లాడతారా..! కేసీఆర్ గురించి ఆమె కామెంట్స్ ఎవరు నమ్ముతారు తెలంగాణలో..? లిక్కర్ కేసు లో క్లీన్ చిట్ ఎక్కడొచ్చింది..? ఆమె పార్టీ కాదు కదా.. ఆమె ఎక్కడ పోటీ చేసినా గెలవదు..! అంటూ కామెంట్స్ చేశారు.

అన్నమీద కోపం ఉంటే తండ్రిని అలా అనడమేంటి.. పార్టీ పెట్టడమేంటని రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు.

## మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నూతన కార్యవర్గ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం




టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ప్రమాణ స్వీకారం చేసిన నారా లోకేష్

నారా లోకేష్, నూతన కార్యవర్గ కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించిన పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు

252 మందితో తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గం ఏర్పాటు

అంతకుముందు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, ఇతర కార్యవర్గ సభ్యులు

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయానికి పెద్దఎత్తున తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

పార్టీ నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారిన తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం



**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ కుమార్తె త్రిలోక్య పావని - ప్రభాస్ ల నిశ్చితార్థం కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

# టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టిన నారా లోకేష్

# మంత్రి నారా లోకేష్ ను కలిసి అభినందనలు తెలిపిన పలువురు నేతలు












మంగళగిరి: తెలుగుదేశం పార్టీలో మరో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేష్ కు పలువురు నేతలు అభినందనలు తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయంలోని తన చాంబర్ లో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు మంత్రి నారా లోకేష్ ను కలిసి అభినందనలు తెలిపారు. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా నారా లోకేష్ పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా నేతలు ఆకాంక్షించారు. అంతకుముందు ఎంపీ, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి నారా లోకేష్ సమక్షంలో కేక్ కట్ చేశారు. శ్రీకృష్ణదేవరాయలకు కేక్ తినిపించి మంత్రి నారా లోకేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర హెచ్చరిక



న్యూ ఢిల్లి ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్)ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర హెచ్చరిక చేశారు. ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించి దౌత్య మార్గంలో త్వరితగతిన పరిష్కారం లభించకుంటే అమెరికా కఠిన వైఖరిని తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈమేరకు సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ట్రంప్ ఒక పోస్ట్ పెట్టారు. ట్రంప్ అసాల్ట్ రైఫిల్‌ను పట్టుకున్న సీన్‌తో పాటు 'నో మోర్ మిస్టర్ నైస్ గై' (ఇకపై మంచివాడిలా ఉండను) నినాదం కలిగిన ఫొటోను తన పోస్ట్‌కు జతపరిచారు. ఇరాన్-అమెరికా చర్చల ప్రక్రియలో వేగం లోపించడంపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ కలిసికట్టుగా నిర్ణయాలను తీసుకోలేకపోతోందని ఆయన మండిపడ్డారు. అమెరికాతో ఒప్పందాన్ని ఖరారు చేసే సమర్థత ఇరాన్ పాలకుల్లో లేదని విమర్శించారు. అణు నిరాయుధీకరణ ఒప్పందంపై ఎలా సంతకం చేయాలో కూడా ఇరాన్ పాలకులకు తెలియదని ట్రంప్ ఎద్దేవా చేశారు. ఇరాన్‌ను పాలిస్తున్న వాళ్లు త్వరగా బుద్ధి తెచ్చుకుంటే మంచిదని హితవు పలికారు.

**అమెరికా ప్రతిపాదనలను వ్యతిరేకిస్తే తీవ్ర పర్యవసానాలు**

అమెరికా చేస్తున్న ప్రతిపాదనలను వ్యతిరేకించడాన్ని ఇరాన్ కొనసాగిస్తే తీవ్ర పర్యవసానాలు ఉంటాయనే సంకేతాలను ఇచ్చేలా ట్రంప్ తాజా హెచ్చరిక ఉందని పరిశీలకులు అంటున్నారు. అణ్వస్త్ర కార్యక్రమంపై గతంలో అమెరికా – ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందం స్థానంలో కొత్త ఒప్పందాన్ని అమల్లోకి తేవాలనే పట్టుదలతో ట్రంప్ ఉన్నారు. పాత ఒప్పందం సమగ్రంగా లేదని, దానివల్ల అంతర్జాతీయ భద్రతకు సరైన హామీ లభించడం లేదని ట్రంప్ గతంలో చాలాసార్లు చెప్పారు. నేరుగా అణ్వస్త్ర కార్యక్రమంపై సంప్రదింపులకు ఇరాన్ సిద్ధమైతే తప్ప, చర్చల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే ప్రసక్తే లేదని ఇటీవలి అమెరికా ప్రెసిడెంట్ తేల్చి చెప్పారు. ఇరాన్ పతనం అంచున ఉండబట్టే, హర్మూజ్ జలసంధిని వీలైనంత త్వరగా తిరిగి తెరవాలని తమపై ఒత్తిడి చేస్తోందని ట్రంప్ తాజాగా వ్యాఖ్యానించారు. ఒకవేళ అణ్వస్త్రాలను పొందడంలో ఇరాన్ విజయవంతమైతే ప్రపంచమంతా దానికి బందీగా మారిపోతుందని ఆయన హెచ్చరించారు.

**సైన్యం ఉపసంహరణకు, వైమానిక దాడులకు నో**

ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌తో సైనిక ఘర్షణను సాగదీస్తున్న పర్యవసానంగా అమెరికాపై ప్రాంతీయ, అంతర్జాతీయ ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌తో దీర్ఘకాలిక ఆర్థిక ఘర్షణకు అమెరికా ప్రభుత్వం సిద్ధమవుతోందని ఓ అమెరికన్ మీడియా సంస్థ కథనాన్ని ప్రచురించింది. ఈ వ్యూహంలో భాగంగానే ఇరాన్ ఓడరేవుల ముట్టడిని అమెరికా నౌకాదళం కొనసాగిస్తోందని తెలిపింది. ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు, చమురు ఎగుమతులకు అంతరాయం కలిగించాలనే ప్లాన్‌తో అమెరికా ఉందని పేర్కొంది. ఇరాన్ ఓడరేవుల ముట్టడిని ఇకపైనా కొనసాగించేందుకు ప్రణాళికలను రెడీ చేయాలని తన టీమ్‌ను ట్రంప్ ఆదేశించినట్లు ఆ కథనంలో ప్రస్తావించారు. గల్ఫ్ ప్రాంతం నుంచి అమెరికా సైన్యం ఉపసంహరణకు కానీ, మళ్లీ ఇరాన్‌పై వైమానిక దాడులను ప్రారంభించడానికి కానీ ట్రంప్ మొగ్గు చూపడం లేదని మరొక అమెరికన్ మీడియా సంస్థ కథనాన్ని పబ్లిష్ చేసింది. వాటికి బదులుగా తక్కువ రిస్క్, ఎక్కువ ఎఫెక్ట్‌తో కూడిన ఇరాన్ ఓడరేవుల ముట్టడికే అమెరికా సర్కారు మొగ్గు చూపుతోందని తెలిపింది. ఆర్థికంగా ఇరాన్‌ను బలహీనపర్చి దారికి తెచ్చుకోవాలనే ప్లాన్‌తో ట్రంప్ ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

# హత్య కేసులో నలుగురు నిందుతులకు యావజ్జీవ కారాగార (జీవిత ఖైదు) శిక్ష.

## నేరం చేస్తే శిక్షలు తప్పవు, శిక్షలతోనే సమాజంలో మార్పు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.



**రాజన్న సిరిసిల్ల జిల్లా , ఏప్రిల్ 29 (ప్రజాబలం ప్రతినిధి)**ముస్తాబద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసులో నలుగురు నిందితులకు యావజ్జీవ కారాగార (జీవిత ఖైదు) శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 6,000/- జరిమానా విధిస్తూ బుధవారం సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ గారు కీలక తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని , శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసులు , ప్రాసిక్యూషన్ సమన్వయంతో వ్యూహాత్మకంగా న్యాయ విచారణ, న్యాయ నిరూపణ నిర్వహించి నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.పై కేసుల్లో నిందితులకు శిక్ష పడటంలో కృషి చేసిన అదనపు ఎస్పీ చంద్రయ్య, పీపీలు పెంట శ్రీనివాస్,అశ్విన్,అప్పటి సి.ఐ లు సర్వర్,ఉపేందర్, మొగిలి, సిఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కోర్ట్ మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్,కోర్టు కానిస్టేబుల్ రాజేందర్,దేవేందర్ ప్రస్తుత సి.ఐ నాగేశ్వరరావు,ఎస్.ఐ గణేష్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# పల్లె పల్లెకు బీసీ వాదం.. బీపీ మండల్ 40 సిఫారసులు అమలుకై పోరాటం.. బేరి రామచంద్ర యాదవ్



**శేర్లింగంపల్లి ( ప్రజాబలం ప్రతినిధి నరేష్) ఏప్రిల్ 29** పల్లె పల్లెకు బీసీ వాదం.. బీపీ మండల్ 40 సిఫారసులు అమలుకై పోరాటం అనే నినాదంతో పోరాటం చేయాలని బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. పార్లమెంట్లో ఓబీసీ బిల్లు ప్రవేశపెట్టాలి రెండు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ తెలుగు రాష్ట్రాలలో రాబోయే ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు రాజ్యాంగ సవరణకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముఖ్యమంత్రులు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. బీసీ సామాజిక చట్టం ను వెంటనే అమలు చేయాలి కేంద్రంలో ఓబీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి బీసీల రాజ్యాంగబద్ధమైన హక్కులను సాధించుకునేందుకు ప్రతి గ్రామంలో బీసీలు సంఘటితం అవ్వాలని బీసీ కులాల ఐక్యవేదిక సంఘాల అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ పిలుపునిచ్చారు.

# కేంద్రం కొత్త రూల్స్ రూ.50 వేల లావాదేవీలపై పాన్ కార్డ్ తప్పనిసరి




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 29 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:**ఆర్థిక లావాదేవీలలో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం,పాన్ కార్డ్ నిబంధనలలో భారీ మార్పులు చేసింది ఇకపై రూ.50 వేలు దాటిన అన్ని లావాదేవీలకు పాన్ కార్డ్ తప్పనిసరి చేసింది,కారు,బైక్, బంగారం, భూమి, ఇల్లు కొనుగోలు, డీమ్యాట్ ఖాతా తెరవడం, మ్యూచువల్ ఫండ్స్, బాండ్లు, డిబెంచర్లలో పెట్టుబడులు, రూ.10 లక్షలకు మించిన నగదు, డిపాజిట్లు, విత్ డ్రాలు, రూ.లక్ష దాటి చేసే సెక్యూరిటీ కొనుగోళ్లకు పాన్ తప్పనిసరి ఏప్రిల్ 1,నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి ఫామ్ 60, 61 స్థానంలో ఫామ్ 97, 98, తీసుకొచ్చారు......

# మర్పల్లి ఈసీ విట్టల్ రావు పదవి విరమణ



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 29 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఈజీగా విధులు నిర్వహిస్తున్న విట్టల్ రావు పదవి విరమణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు ఈసీ విట్టల్ రావు విధి నిర్వహణలో ఎంతో బాధ్యతగా క్రమశిక్షణగా చాలా చక్కగా విధులు నిర్వహించేవాడు ఈరోజు వారు పదవి విరమణ ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించడం జరుగుతోంది కాబట్టి ఇంతకాలం మనతో కలిసి విధి నిర్వహణలో ఉద్యోగం చేసి అందరితో ఎంతో అన్యోన్యంగా ఆప్యాయంగా సంతోషంగా పలకరింపు తో విధి నిర్వహణలో కలిసిమెలిసి పనిచేశాం ఈరోజు వారు పదవి విరమణ కార్యక్రమంలో అధికారులు నాయకులు శ్రేయోభిలాషులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని తెలిపారు

# 10 తరగతిలో విజయ దుందిబి మోగించిన శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు

**ప్రజాబలం ప్రతినిధి వేములవాడ ఏప్రిల్ -29** వేములవాడలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు 10 తరగతిలో విజయ దుందిబి మోగించారు. బుధవారం రోజున వెలుబడిన ఉత్తీర్ణతలో జిల్లాలో అత్యధిక మార్కులు సాధించారు. మొత్తం 600 మార్కులకు గాను గజవాడ అశ్రిత 589 , గూడెల్లి. అర్ణవ్ 589, కూర సుదీప్తి 579 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుదేశి కుమారి మాట్లాడుతూ విద్యార్థులు అహర్నిశలు కష్టపడి మంచి ఉత్తీర్ణతను సాధించారని విద్యార్థుల యొక్క కల నెరవేరే విధంగా మా పాఠశాల ఉపాధ్యాయులు మంచి బోధనను అందించారని అదేవిధంగా 62 మంది విద్యార్థులకు 500 కి పైగా మార్కులు వచ్చాయని, 26 మంది విద్యార్థులకు 550 కి పైగా మార్కులు వచ్చాయని విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వహణ అధికారి ఎం.రాజు, సమన్వయకర్త పి. ప్రవీణ్, తదితరులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# పది ఫలితాల్లో హోతీ-(కె) గురుకుల పాఠశాల విద్యార్థినుల ఘనవిజయం




**జహీరాబాద్, ఏప్రిల్ 29 ప్రజాబలం ప్రతినిధి:** పదవ తరగతి ఫలితాల్లో జహీరాబాద్ మండలం హోతీ-(కె)లోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్/ జూనియర్ కాలేజ్ విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఈ పాఠశాల విద్యార్థినులు అత్యుత్తమ ఫలితాలతో తమ పాఠశాల పేరును నిలబెట్టారు.

ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలకు మొత్తం 80 మంది విద్యార్థినులు హాజరుకాగా, 99 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కేవలం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, మార్కుల విషయంలోనూ విద్యార్థినులు సత్తా చాటారు. మొత్తం విద్యార్థినులలో 62 మంది 500లకు పైగా మార్కులు సాధించడం విశేషం.

గొల్ల మనసా 554/600
బెలేగే దిక్షిత 553/600
అరుపుల మంజుల కుమారి551/600
చిల్లర్గి ఇస్మాయిల్ బీ 550/600
బల్లేపు దిక్షిత 549/600
బ్రహ్మణ సమ్యుక్త 549/600

విద్యార్థినుల ఘనవిజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ ఎ. సురేఖ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినుల కష్టం, ఉపాధ్యాయుల బోధనా పటిమ తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని ఆమె పేర్కొన్నారు. విజయం సాధించిన విద్యార్థినులకు, వారికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయ బృందానికి ఆమె హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# ఆలయ మహోత్సవంలో పాల్గొన్న కేటీఆర్



కూకట్పల్లి రామాలయంలో వైభవంగా జరిగిన గరుడ హనుమద్ స్వామివార్ల మూర్తిస్థాపన మహోత్సవంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. స్వామివార్ల విగ్రహాలకు క్షీరాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా సాగిన నిత్య పూర్ణాహుతి జరిగింది. ఈ మూర్తిస్థాపన మహోత్సవంలో కూకట్పల్లి ప్రజలు భారీగా పాల్గొన్నారు.

# తాగడానికి మంచి నీళ్ళు ఇవ్వండి మహాప్రభో

## సూర్యాపేట జిల్లాలో తాగు నీటి కొరతతో రోడ్డెక్కిన ప్రజలు

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో నెల రోజులుగా తాగు నీరు రావడం లేదని కాలనీ వాసులు ఆందోళనకు దిగారు. నాయకులను అడిగితే ఫ్రీగా ఓట్లు వేశారా? రూ.2000 తీసుకోలేదా అని అంటున్నారని.. అధికారులకు, కౌన్సిలర్లకు ఫోన్లు చేసినా ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. కాలనీలో కాలువ శుభ్రం చేస్తే రూ. 50, చెత్త తీసుకుపోతే రూ.100 అడుగుతున్నారు.. ఇవ్వకపోతే పని చేయడం లేదని పారిశుధ్య కార్మికులపై మండిపడుతున్నారు. తమకు వెంటనే తాగు నీరు ఇవ్వాలని దంతాలపల్లి రహదారిపై ఖాళీ బిందెలతో కాలనీ వాసులు రోడ్డెక్కారు. దాంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

# యువత మారకద్రవ్యాలకు దూరంగా ఉండండి
# బంగారు భవిష్యత్తును నిర్మించుకోండి
## ఎస్సై తాజుద్దీన్




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 29 గోవిందరావు పేట్**ఎస్సై తాజుద్దీన్ మాట్లాడుతూ
డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుంది
సమాజంలో డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి
అనవసర ఆకర్షణలకు లోనైతే బాలికల భవిష్యత్తు అంధకారం.
డ్రగ్స్ వినియోగం యువత బంగారు భవిష్యత్తును నాశనం చేస్తుందని, సమాజంలో డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని యువతకు తెలియజేశారు
ములుగు జిల్లా స్పీ సుధీర్ రామ్నాథ్ కేకేన్ ఐపిఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ రవీందర్ సూచనల మేరకు.పసర సిఐ దయాకర్ పర్యవేక్షణలో ఎస్ ఐ తాజుద్దీన్ పోలీస్ శాఖ మరియు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సంయుక్తంగా
ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా గోవిందరావుపేట మండలంలోని రంగాపురం గ్రామంలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో భాగంగా మారక ద్రవ్యాలపై కళాకారుల ద్వారా నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తూ గ్రామస్తులకు అవగాహన కల్పించారు.
బాలల భద్రత, సంరక్షణ మరియు డ్రగ్స్ నిర్మూలన వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధికారులు అధ్యక్షత వహించి, కార్యక్రమ లక్ష్యాలను వివరించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ తాజుద్దీన్. మరియు ఐసిడిఎస్ సిడిపిఓ విజయ మాట్లాడుతూ, "బాలికలు అనవసరమైన ఆకర్షణలకు లోనైతే వారి అందమైన భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు.
యువతలో సరైన అవగాహన, నైతిక విలువలు పెంపొందించడం సమాజ అభివృద్ధికి అత్యంత అవసరమని తెలిపారు.
కిశోర బాలికలు తమ ఆరోగ్యం, భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, వ్యక్తిగత పరిశుభ్రత, సమతుల్య ఆహారం, శుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని వివరించారు.
చిన్న వయస్సులో కలిగే ప్రేమ, ఆకర్షణ వంటి భావోద్వేగాలను అర్థం చేసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.
ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో మొబైల్ వినియోగంపై నియంత్రణ అవసరమని, అనుమానాస్పద వ్యక్తులతో ఆన్లైన్ లో సంబంధాలు పెట్టుకోవద్దని హెచ్చరించారు.
అలాగే బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, అవి బాలికల భవిష్యత్తును దెబ్బతీస్తాయని పేర్కొన్నారు.
బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టాల గురించి వివరించి, ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.
డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, సమాజంలో డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



, 18 సంవత్సరాల లోపు బాలబాలికలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే చైల్డ్ హెల్ప్లైన్ టోల్ ఫ్రీ నంబర్లు 1098 / 112 కు కాల్ చేయాలని సూచించారు
"ఈ కార్యక్రమంలో సర్పంచ్ సమ్మక్క, ఉప సర్పంచ్ శ్రీను, సోషల్ వర్కర్ జ్యోతి, డీసీపీఓ ఓంకార్, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు, గ్రామ పెద్దలు, కౌన్సిలర్ సంధ్య
పోలీసు సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది, యువత గ్రామస్తులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఫలితం ఏదైనా బిడ్డలను అక్కున చేర్చుకోండి
# పరీక్ష ఫలితాలు జీవితానికి ముగింపు కాదు..బాలానగర్ సీఐ

### విద్యార్థులకు, తల్లిదండ్రులకు బాలానగర్ పోలీసుల భరోసా..

**కూకట్పల్లి (ప్రజాబలం) ఏప్రిల్ 29:**తెలంగాణలో టెన్త్ (రూజ-2026) రిజల్ట్స్ సందడి.విద్యార్థుల్లో ఒకవైపు ఉత్కంఠ, మరోవైపు ఆందోళన. ఈ క్రమంలో బాలానగర్ పోలీసులు రంగంలోకి దిగారు. మార్కుల కంటే ప్రాణం ముఖ్యం అంటూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు కీలక సూచనలు చేశారు. పదో తరగతి ఫలితాల నేపథ్యంలో బాలానగర్ సీఐ నర్సింహా రాజు విద్యార్థులకు కీలక సూచనలు చేశారు. పరీక్షల్లో వచ్చే మార్కులు కేవలం ఒక అంకె మాత్రమేనని, అవి జీవితాన్ని శాసించలేవని ఆయన స్పష్టం చేశారు. ఫలితాలు ఎలా ఉన్నా ఆత్మహత్య వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు.




ఫలితం ఏదైనా అది జీవితానికి ముగింపు కాదు తదుపరి విజయానికి మొదటి మెట్టు మాత్రమే అని విద్యార్థులకు ధైర్యం చెప్పారు. ఫలితాల తర్వాత పిల్లలపై అనవసర ఒత్తిడి తీసుకురావద్దని, వారిని ఇతరులతో పోల్చి చిన్నబుచ్చవద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు. పిల్లలు మౌనంగా ఉన్నా లేదా ఒంటరిగా ఉండటానికి ప్రయత్నిస్తున్నా వెంటనే వారితో ప్రేమగా మాట్లాడి ధైర్యం కల్పించాలన్నారు. తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్న విద్యార్థులు లేదా ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు వెంటనే 100 కు కాల్ చేయాలని లేదా మానసిక నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు. ఓటమిని చూసి కుంగిపోవద్దు గెలుపును చూసి పొంగిపోవద్దు. రేపటి బంగారు భవిష్యత్తుకు మీ ప్రాణమే పునాది. సైబరాబాద్ పోలీసులు ఎల్లవేళలా మీకు అండగా ఉంటారని సీఐ నర్సింహా రాజు అన్నారు.

# పదవ తరగతి ఫలితాలలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన ములుగు జిల్లా

### విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బందికి శుభాకాంక్షలు
### --జిల్లా కలెక్టర్ మరియు మెజిస్టేట్ భోర్కడే హేమంత్ సహదేవరావు,

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 29 ములుగు** బుధవారం(29-04-2026) వెలువడిన పదవ తరగతి ఫలితాలలో ములుగు జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి విజయకేతనం ఎగరవేయడం సంతోషకరమైన విషయమని జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ భోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు.



ఈ విజయానికి కారణమైనటువంటి విద్యార్థిని విద్యార్థులకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారికి సరైన మార్గ నిర్దేశం చేస్తూ ఉత్తమ ఫలితాల సాధన కోసం కృషి చేసినటువంటి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు.
జిల్లాలో మొత్తం 3287 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకా గా 3264 మంది ఉత్తీర్ణత సాధించి 99.30 శాతం తో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి విజయకేతనం ఎగరవేయడం సంతోషకరమైన విషయం అని,
రానున్న రోజులలో కూడా ఇదే ఫలితాలు పునరావృతం అయ్యేలా ప్రతి ఒక్కరు శక్తివంచన లేకుండా కృషి చేస్తారని ఆశిస్తున్నానని తెలిపారు.
జిల్లాలో ఏటూరునాగారం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏటూరు నాగారం విద్యార్థిని కె. కృష్ణ 589 మార్కులతో జిల్లాలో మొదటి స్థానంలో నిలవడం జరిగిందని తెలిపారు.

# గర్భిణీ స్త్రీల సేవలపై ప్రత్యేక దృష్టి




కృష్ణానగర్ పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్ మను చౌదరి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 29:అల్వాల్ మండలం పరిధిలోని కృష్ణానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ మను చౌదరి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన, రోగులకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు అందుతున్న సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. దీనిపై సిబ్బంది స్పందిస్తూ.. గర్భిణీలు క్రమం తప్పకుండా చెకప్ కోసం ఇక్కడికి వస్తున్నారని, అయితే ప్రసవాల కోసం వారిని అల్వాల్ పీహెచ్‌సీకి పంపిస్తున్నామని తెలిపారు. రక్త నమూనాల సేకరణ ఇక్కడే జరుగుతున్నప్పటికీ, పరీక్షల కోసం వాటిని అల్వాల్ పీహెచ్‌సీకి పంపాల్సి వస్తోందని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆసుపత్రి కొనసాగుతున్న భవనం సరిపోవడం లేదని, కార్యకలాపాలకు ఇబ్బందిగా ఉందని సిబ్బంది కలెక్టర్ కు వివరించారు. ఆసుపత్రిని విశాలమైన చోటుకి తరలించాలని వారు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ మందుల స్టోర్ రూమ్‌ను స్వయంగా తనిఖీ చేశారు. మందుల నిల్వలు, వాటి గడువు ముగిసే తేదీలను క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యమైన మందులు మాత్రమే రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రి భవన సమస్యపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, తగిన స్థలాన్ని అన్వేషించాలని అల్వాల్ తహసీల్దార్‌ను ఆదేశించారు. అలాగే, భవన మార్పునకు సంబంధించి అధికారికంగా ప్రతిపాదనలతో కూడిన వినతి పత్రాన్ని అందజేయాలని ఆసుపత్రి అధికారులను సూచించారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎటువంటి జాప్యం జరగకూడదని, స్థానిక ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట అల్వాల్ తహసీల్దార్ రాములు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పోలీస్ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని సందర్శించిన ఏ ఐ ఐ ఎం ఎస్ హైదరాబాద్ సీనియర్ వైద్యులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 29 ములుగు** సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, ములుగు ను ఏ ఐ ఐ ఎం ఎస్ హైదరాబాద్ సీనియర్ వైద్యులు సందర్శించి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై. ఏల్ శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.
అనంతరం వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధి మరియు ఆరోగ్య సేవల మెరుగుదలకు యూనివర్సిటీని నోడల్ కేంద్రంగా చేసుకుని పలు కార్యక్రమాలను ప్రారంభించాలని ఏ ఐ ఐ ఎం ఎస్ ప్రతిపాదించింది.
ఈ ప్రతిపాదనల్లో మెడికల్ సైన్సెస్‌లో సర్టిఫికేట్ కోర్సులను ప్రారంభించడం కూడా ముఖ్యాంశంగా ఉంది.
త్వరలోనే ఏ ఐ ఐ ఎం ఎస్ హైదరాబాద్ మరియు సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ మధ్య పరస్పర సహకారం కోసం అవగాహన ఒప్పందం కుదిరే అవకాశం ఉంది అని వారు తెలియ చెయ్యడం జరిగింది.

## పశ్చిమ బెంగాల్లో
## చివరిదశ పోలింగ్ ప్రారంభం

న్యూఢిల్లీ పశ్చిమబెంగాల్ బుధవారం చివరి దశ పోలింగ్ ప్రారంభమైంది. మొత్తం 294 స్థానాలకుగానూ తొలి దశలో 152 చోట్ల పోలింగ్ పూర్తయిన సంగతి తెలిసిందే. తాజాగా మిగిలిన 142 సీట్లలో రెండో దశ పోలింగ్ మొదలైంది. ఈ దశలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోటీ చేస్తున్న భవానీపూర్ అత్యంత కీలకమైనది. భాజపా నుంచి సువేందు అధికారి ఇక్కడి నుంచే ఆమెకు పోటీగా బరిలోకి దిగారు. పోలింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఈసీ పటిష్ఠ చర్యలు చేపట్టింది. భారీ సంఖ్యలో కేంద్ర బలగాలను మోహరించారు.

# కుంట్లూరులో హైడ్రా కూల్చివేతలు

రంగారెడ్డి హయత్ నగర్లోని కుంట్లూరులో హైడ్రా కూల్చివేతలు ప్రారంభించింది. కుంట్లూరులో ప్రజయ్ గుల్మహార్ గేటెడ్ కమ్యూనిటీలో కూల్చివేతలకు హైడ్రా అధికారులు వెళ్లారు. బుల్డోజర్లతో వెళ్లిన హైడ్రా అధికారులను కాలనీ వాసులు అడ్డుకున్నారు. ఎలాగైనా కూల్చివేస్తామన్న హైడ్రా అధికారులు చెప్పడంతో ఇరు వర్గాల మధ్య హైడ్రామా కొనసాగింది. ఈ నేపథ్యంలో గేటెడ్ కమ్యూనిటీ వద్ద భారీగా పోలీసులు మోహరించారు.

# ఘనంగా సాయిబాబా దేవాలయం 26 వ వార్షికోత్సవం...


## ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్న ప్రసాద వితరణ.

## హాజరైన పలువురు ప్రముఖులు...

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 29 ఏటూరు నాగారం** ఏటూరునాగారం మండల కేంద్రం లోని శ్రీ షిర్డీసాయి బాబా దేవాలయం యొక్క 26 వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పెండ్యాల ప్రభాకర్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆనంద్ పాండే, అనుజ్ పాండే దేవాలయం లో ఉదయం నుండి సాయిబాబాకి అభిషేకం, అర్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మావోయిస్టు అగ్రనేత బడే దామోదర్ విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి,నైవేద్యం సమర్పించారు. అలాగే మావోయిస్టు అగ్రనేత దామోదర్ ను,పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మడుగురి నాగేశ్వరరావు లను చైర్మన్, కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.అనంతరం దేవాలయం చైర్మన్, కమిటీ సభ్యులు దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు వేలాది సంఖ్యలో పాల్గొని, పూజా కార్యక్రమాల్లో పాల్గొని,,అన్న ప్రసాదం స్వీకరించారు.అనంతరం విచ్చేసిన భక్తులకు అర్చకులు ఆనంద్ పాండే, అనుజ్ పాండే తీర్థ ప్రసాదాలు అందజేశారు.




ఇట్టి కార్యక్రమంలో చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు బచ్చు సతీష్, సహాయ కార్యదర్శి గంజి రమేష్, కోశాధికారి వెంకట్రావు,పెద్దలు బచ్చు సత్యనారాయణ,వెళగందుల మాధవ్,కడవెండి నర్సింహాచారి, చెన్న ముత్తయ్య, కమిటీ సభ్యులు మాదరి తిరుపతి, మైనర్ బాబు, జగదీష్,మహిళా సభ్యులు సరళ, స్వప్న, సుశీల, ఆరే సమ్మక్క మణుగూరు నుండి విచ్చేసిన మహిళా సేవకులు, తదితరులు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# జనాభా గణన-2027 స్వీయ గణనను పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన జిల్లా కలెక్టర్

## ప్రజలందరూ స్వీయ గణనలో పాల్గొనాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి జిల్లా బుధవారం జనాభా గణన-2027లో భాగంగా ప్రారంభమైన "స్వీయ గణన" ప్రక్రియలో జిల్లా కలెక్టర్ ప్రధాన గణన అధికారి ఆశిష్ సంగ్వాన్ గురువారం IDOC కలెక్టరేట్‌లో తన కుటుంబ వివరాలను స్వయంగా పోర్టల్‌లో నమోదు చేశారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనాభా గణన-2027 పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడుతోందని తెలిపారు. మొదటి దశలో భాగంగా స్వీయ గణన 26-04-2026 నుండి 10-05-2026 వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు తాను స్వయంగా వివరాలు నమోదు చేశానని తెలిపారు.

ప్రతి పౌరుడు మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా https://se.census.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి సులభంగా స్వీయ గణన పూర్తి చేయవచ్చని తెలిపారు. నమోదు అనంతరం ప్రతి వ్యక్తికి 12 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూనిక్ ×ఐ) వస్తుందని, దానిని భద్రపరచి ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్‌కు అందజేయాలని సూచించారు.

జిల్లా ప్రజలందరూ మే 10వ తేదీలోపు స్వీయ గణన పూర్తి చేసి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజలు అందించే సమాచారం పూర్తి గోప్యంగా ఉంచబడుతుందని, భవిష్యత్ ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పనలో ఈ సమాచారం కీలకమని వివరించారు.

# పదవ తరగతి ఫలితాలలో రాష్ట్రం తో పాటు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన ములుగు జిల్లా



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 29 ఏటూరు నాగారం** జిల్లాలో మొత్తం 3287 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 3264 మంది ఉత్తీర్ణత సాధించి 99.30 శాతంతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి విజయకేతనం ఎగరవేయడం సంతోషకరమైన విషయం

జిల్లాలో ఏటూరునాగారం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏటూరు నాగారం విద్యార్థిని కె. కృష్ణ 589 మార్కులతో జిల్లాలో మొదటి స్థానంలో నిలవడం పట్ల మండల ఎంఈఓ మల్లయ్య ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు

# రైలులో టికెట్ లేని వ్యక్తి హైడ్రామా

గుడివాడ ధర్మవరం-నరసాపురం రైలులో టికెట్ లేని వ్యక్తి హైడ్రామా నడిపించాడు. బుధవారం ఉదయం 3 గంటలకు గుడివాడ స్టేషన్ కు ధర్మవరం రైలు వచ్చింది. రిజర్వేషన్ కంపార్ట్మెంట్లో టీసీ ప్రయాణికుల టికెట్లు తనిఖీ చేస్తున్నారు. టీ.సీను చూసి ఒక వ్యక్తి రైలు పైకప్పు ఎక్కి హాల్ చల్ చేసారు. రైల్వే పోలీసులు అతి కష్టం మీద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించారు. పూర్తి వివరాలు సేకరిస్తు?నారు. ఘటనతో రైలు అరగంట పాటు స్టేషన్లో నిలిచిపోయింది.

# నాగర్ కర్నూల్‌లో ప్రభుత్వ వైద్యుల సంఘం ఎన్నికలు విజయ వంతం...

## జిల్లా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ రచ్చ రఘు ఘన విజయం....

## జిల్లా అధ్యక్షునిగా 2 సంవత్సరాల పాటు కొనసాగింపు...





**నాగర్ కర్నూల్ జిల్లా ప్రజాబలం ప్రతినిధి** నాగర్ కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ (TG GDA) గుర్తింపు పొందిన సంఘం ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన జిల్లా ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తయ్యాయి.

ఈ ఎన్నికలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి,ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి,రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నరహరి మార్గదర్శకత్వంలో, జిల్లా స్థాయి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్. రాజేష్ గౌడ్ సమర్థంగా నిర్వహించారు.

ఈ ఎన్నికల్లో జిల్లా లోని ప్రభుత్వ మెడికల్ కళాశాల,ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి, ఏరియా ఆసుపత్రిలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (PHCs) మరియు వైద్య విధాన పరిషత్‌కు చెందిన ప్రభుత్వ వైద్యులు కలిపి మొత్తం 70 మంది ఓటర్లలో 60 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో 2 ఓట్లు చెల్లనివిగా ప్రకటించబడ్డాయి.

ఓట్లఫలితాలు:

డాక్టర్ రచ్చ రఘు --31 ఓట్లు

సమీప ప్రత్యర్థి డాక్టర్ శేఖర్--27 ఓట్లు

ఈ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్,జనరల్ సర్జన్ ఁ విభాగాధిపతి (HOD) డాక్టర్ రచ్చ రఘు గెలుపొందారు.నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అధికారికంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఎస్.రాజేష్ గౌడ్ ప్రకటించారు.

ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ, "నాపై విశ్వాసం ఉంచి అత్యధిక ఓట్లతో గెలిపించిన ప్రతి సహచర వైద్యుడికి హృదయపూర్వక కృతజ్ఞతలు.ప్రభుత్వ వైద్యుల హక్కులు,సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తాను. జిల్లాలో వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగు పర్చేందుకు నిరంతరం కృషి చేస్తాను" అని తెలిపారు.ఈ ఎన్నికలతో జిల్లాలో ప్రభుత్వ వైద్యుల ఐక్యత మరింత బలపడటంతో పాటు,వారి సమస్యల పరిష్కారానికి బలమైన వేదిక ఏర్పడిందని వైద్యులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ డాక్టర్ల జిల్లా అధ్యక్షునిగా రెండు సంవత్సరాలపాటు కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేస్తానని అన్నారు.

# 10వ తరగతి ఉత్తీర్ణతలో రాణించిన హంసిని స్కూల్ విద్యార్థులు





**ప్రజాబలం ప్రతినిధి వేములవాడ ఏప్రిల్ -29** వేములవాడ పట్టణంలోని హంసిని స్కూల్ విద్యార్థులు 10 తరగతి పరీక్షల్లో బుధవారం రోజున వెలువడిన ఉత్తీర్ణతలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు వారిలో ఆర్. అక్షయ 561, ఎన్. విజ్వల్ 560,లు అత్యధిక మార్కులు సాధించి స్కూల్ టాపర్ గా నిలిచారు. మొత్తం 47 మంది విద్యార్థులు పరీక్ష రాయగ 17 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించారని అందరినీ పాఠశాల కరస్పాండెంట్ నరాల సంతోష్ అభినందించారు. విద్యార్థుల నైపుణ్యం లో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులకు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మల్లి బాబు యాదవ్



**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 29 (ప్రజాబలం)** ఇల్లందు నియోజకవర్గం మండుటెండలు 46 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నప్పటికీ మంచి వివాహ ముహూర్తాలు ఉండటంతో రాజకీయ నాయకులకు వివాహాలకు హాజరు కావటం తప్పనిసరి అయింది. ఈ నేపథ్యంలో మాజీ జెడ్పిటిసి మేకల మల్లి బాబు యాదవ్ పలు వివాహ శు భకార్యాలలో పాల్గొని నూతన వధూవరులను అక్షంతలు వేసి ఆశీర్వదించడం జరిగింది. బుధవారం నాడు ఈ ఆర్ ఆర్ రిసార్ట్స్ ఖమ్మంలో జరిగిన కుర్రి శ్రీనివాసరావు - విజయ ల కుమారుడు ఉదయ్ తేజ్ కుమార్ యాదవ్ - ప్రవీణ( మదిర మండలం రొంపిమళ్ల గ్రామానికి చెందిన బాజినేని ఆంజనేయులు మల్లీశ్వరి ల కూతురు ) వివాహం,పండితాపురం వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో జరిగిన శివరాత్రి వెంకన్న- వసంత ల కూతురు శ్రీ త్రివేణి- ప్రమోద్ కుమార్ ( హైదరాబాద్ కు చెందిన గట్ల చంద్రశేఖర్- విజయ ల కుమారుడు ) ల వివాహం, వెంకటలక్ష్మి ఫంక్షన్ హాల్, ముచ్చర్ల గ్రామంలోని ఫంక్షన్ హాల్లో జరిగిన పొన్నెకల్లు గ్రామానికి చెందిన

బొరి గొర్ల రమేష్ - పార్వతి ల కుమారుడు నవీన్= నవ్యశ్రీ( ఏన్కూర్ మండలం తూతకలింగన్నపేట గ్రామానికి చెందిన పల్లెబోయిన ముత్తయ్య - నాగమణి ల కూతురు) వివాహం జరిగింది. ఈ శుభకార్యాలన్నింటిలో పాల్గొన్న మల్లిబాబు యాదవ్ అక్షింతలు వేసి కలకాలం నిండు నూరేళ్లు అన్యోన్య దాంపత్యంతో చల్లగా జీవించాలని, పిల్లాపాపలతో అభివృద్ధి చెందాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, దమ్మాలపాటి సత్యనారాయణ, సత్తి వెంకన్న డాక్టర్ నాగేశ్వరరావు బంధుమిత్రులు మరియు తదితరులు పాల్గొన్నారు

## వైసీపీ ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరి మళ్ళీ అరెస్ట్

కుప్పం వైకాపా ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరిని పోలీసులు మరోసారి అరెస్టు చేసారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా అరెస్ట్ చేశారని వైసీపీ నేతలు మండిపడ్డారు. పూడి శ్రీహరిని కుప్పం పోలీసులు బెంగళూరు లో అదుపులోకి తీసుకున్నారు. సోషల్ మీడియా కేసులో హైకోర్టు, సుప్రీం కోర్టు ఆదేశాలను ఏపీ పోలీసులు పట్టించుకోవడం లేదని వైకాపా మండిపడింది.

# కుల రహిత సమాజం కోసం జర జాతర

**ముత్తమాల ప్రసాద్ అధ్యక్షతన కార్యక్రమాల నిర్వహణ**

**కెవిపిఎస్ ప్రజా,సామాజిక సంఘాల ఆధ్వర్యంలోసాంస్కృతిక కార్యక్రమాలు**

**నందిగామ కృష్ణ ఆధ్వర్యంలో డప్పు, సూర్యాపేట వారిచే బ్రాహ్మణ, దళిత సంభాషణ ఆట పాట మాట నిర్వహణ.**

**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 29 (ప్రజాబలం) ఖమ్మం** కార్పొరేషన్ పరిధిలో రమణ గుట్ట ప్రాంతంలో జరిగిన సభలో కుల రహిత సమాజము కోసము కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, కెవిపిఎస్ ప్రజా, సామాజిక సంఘాల ఆధ్వర్యంలోజన జాతర కార్యక్రమంఅధ్యక్షులు ముత్తమాల ప్రసాద్ అధ్యక్షతన జరిగినది దీనిలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి







తప్పెట్ల స్కైలాబ్ బాబు పాల్గొని కుల వ్యవస్థ లో వివక్షతను ఎక్కువగా ఉంది అని దీనిని పారద్రోరడానికి పూలే, అంబేద్కర్ జన జాతర కార్యక్రమం నిర్వహించినట్లు, మహనీయులు చెప్పిన విషయాలు సమాజంలో కిందిదాకా అమలుపరిచినప్పుడే మానవుల అంతా మనుషులేనని, కులాలన్నీ సమానమని మనుషులంతా సమాన భావన ఏర్పడుతుందని కావున ప్రజలు, కవులు, కళాకారులు, మేధావులు బహుజన ఉద్యమకారులు సామాజిక ఉద్యమకారుడు అంతా ఏకమై కులాల వ్యవస్థ పై పోరాడి ఈ సమాజంలో మానవత్వాన్ని నెలకొల్పాలని కోరినారు జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ మాట్లాడుతూ కుల వ్యవస్థలపై పోరాటం ఆగదని, అందరూ ఐక్యమై కలిసి రావాలని కోరినారు ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సామాజిక ,బహుజన నాయకులు పాల్గొన్నారు. వీరిలో కత్తి నెహ్రూ, కోరిపల్లి శ్రీనివాస్ ,పీవీ సిద్ధార్థ కెవిపిఎస్ నాయకులు బండి రమేష్, మాచర్ల భారతి, పాపిట్ల సత్యనారాయణ, నగరికంటి చిరంజీవి , కొమ్ము శ్రీను, గుమ్మడి బిక్షం ,ఎస్కే సైదులు, కర్లకుంట నరేష్ , మేడి బిక్షం, రూరల్ మండల అధ్యక్ష కార్యదర్శులు, టూ టౌన్ అధ్యక్ష కార్యదర్శులు, త్రీ టౌన్ నాయకులు, పాల్గొన్నారు సామాజిక సంఘ నాయకులు మెరుగు సత్యనారాయణ , ఎర్రా శ్రీనివాసరావు ,మెరుగు రమణ ,బండి పద్మ , తుమ్మ విష్ణు, నవీన్ రెడ్డి ఎస్కే బషీర్ ,బండారు రమేష్ తదితరులు పాల్గొన్నారు

## పట్లూర్, పదవ తరగతిలో వసతి గృహం విద్యార్థులు 100% ఘన విజయం వార్డెన్ తుల్జారం గౌడ్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 29(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండలంలోని పట్లూర్ ప్రభుత్వ బాలుర వసతి గృహం లో 15 మంది 10వ తరగతి పరీక్షలకు హాజరు కాగా 15 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కావడం సంతోషంగా ఉందని హాస్టల్ సంక్షేమ అధికారి జి. తుల్జారాం గౌడ్ తెలిపారు వసతి గృహంలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని విద్యార్థులకు ప్రత్యేక బోధన బోధించడానికి ప్రత్యేకంగా ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని ఆయన అన్నారు ప్రభుత్వ హాస్టల్ లో నివసిస్తూ ప్రభుత్వ పాఠశాలలో విద్యాను అభ్యసించడం వల్ల పట్లూర్ హాస్టల్ విద్యార్థులు 15 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనరని తెలిపారు ప్రభుత్వ హాస్టల్లో నివసిస్తూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావడం సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు పదవ తరగతి విద్యార్థుల గురించి స్పెషల్ క్లాసులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వసతి గృహం లో క్లాసులు నిర్వహించడం జరిగిందని తెలిపారు ఎప్పటికప్పుడు పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు తల్లిదండ్రులకు వసతి గృహము అధికారి వాడెన్,తులజ రామ్ గౌడ్ మంచి అభినయ సంబంధాలు ఉండటం వల్ల ఈరోజు విద్యార్థులు 100% పదవ తరగతిలో ఘనవిజయం సాధించారని తెలిపారు వచ్చే సంవత్సరం కూడా నాణ్యమైన విద్యను అందించి మన వసతి గృహంలో స్పెషల్ క్లాసులు నిర్వహించి హండ్రెడ్ పర్సెంట్ విద్యార్థులకు విద్యార్థుల భవిష్యత్తుకు నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తుల్జారాం గౌడ్ తెలిపారు

## ఇస్కాన్ మందిరంలో ఘనంగా నరసింహ జయంతి వేడుకలు.




**రాజన్న సిరిసిల్ల జిల్లా , ఏప్రిల్ 29 (ప్రజాబలం ప్రతినిధి)**తంగలపల్లి మండలం నేరేళ్ళ గ్రామంలోని ఇస్కాన్ జగన్నాథ మందిరంలో(30/04/2026) శ్రీ నరసింహ స్వామి జయంతి ఆవిర్భావ దినోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించబడుతుందని ఆలయ నిర్వాహకులు సిరిసిల్ల ప్రెస్ మీట్ లో తెలిపారు. ఈ వేడుకల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని. సాయంత్రం 3:30 నుండి 4:00 గంటల వరకు హరినామ సంకీర్తనతో వేడుకలు ప్రారంభమవుతాయి. అనంతరం 4:00 నుండి 5:00 గంటల వరకు శ్రీ నరసింహ స్వామి యజ్ఞం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. సాయంత్రం 5:00 నుండి 5:45 వరకు హరికథ, మంగళ హారతి , సాయంత్రం 6:30 గంటల నుండి భక్తులందరికీ మహా అన్నప్రసాద వితరణ భోజనం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఇస్కాన్ మేనేజర్ ప్రాణనాథ్ అచ్యుత దాస్, రాధా గోపేశ్వరి దాస్, బలరామ్ ప్రభు, భక్త కన్న ప్రభు తదితరులు పాల్గొన్నారు. నేరేళ్ళ పరిసర ప్రాంతాల భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

# పట్లూర్,తాండలో బి రవి కూతురు వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే డా,మెతుకు ఆనంద్




**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 29(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్, తండాలోవివాహ కార్యక్రమం నకు మాజి శాసనసభ్యులు డా, మెతుకు ఆనంద్ , మాజి జడ్పీటీసీ పబ్బే మధుకర్, ఎతీం పార్టీ మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మాజి జఎజూజూ మోహనరెడ్డి, బి ఆర్ ఎస్,మండల యూత్ అధ్యక్షులు మధుకర్, పట్లూరు మాజి సర్పంచ్ ఇందిర అశోక్, బి.ఆర్.ఎస్,కాంటెస్ట్ సర్పంచ్ సునీల్,వికాస్,బజ్జు, రమేష్, ప్రభు, అరవింద్, డీలర్ ప్రభాకర్, పాపయ్య, మురళి తదితరులు పాల్గొని నూతన వదు వరులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలనిఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఈరోజు బుధవారం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం పిఎసిఎస్ చైర్మన్లకు శుభవార్త చెప్పింది

## నాలుగు నెలల అవిశ్రాంత పోరాటం ఫలితంగా

**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 29, (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** పి ఏసి ఎస్ చైర్మన్, అనంతరావు కులకర్ణి ఒకసమావేశంలో మాట్లాడుతూ,14,ఫిబ్రవరి 2025,రోజు ఏ పాలకవర్గమైతే, ఎక్స్టెన్షన్ తీసుకుందో ఆ పాలకవర్గాలన్నీ కూడా తిరిగి పదవి బాధ్యతలు చేపట్టాలని,రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు విలువరించిందని,నిన్ననే పిఏసిఎస్ పాలకవర్గాలను రద్దు చేస్తూ అఫీషియల్ పర్సన్ ఇన్చార్జిలుగా నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన 597, జీవోనుప్రభుత్వమేఉపసంహరించుకున్న దరిమెల,పాలకవర్గాల పునర్ పదవి బాధ్యత చేపట్టడానికి,మార్గం సుగమయింది,ఇది రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాల ప్రతిష్టకు, విచ్ఛిన్నం కాకుండా కృషిచేసిన పలు జిల్లాల పిఏసిఎస్ చైర్మన్ల ఫోరం నాయకులకు మరియు మన అడ్వకేట్ శ్రీ బుచ్చిబాబు అలియాస్ బుచ్చిరెడ్డికి,పిఏసిఎస్ చైర్మన్ పుల్కల్ అనంతరావు కులకర్ణి, ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు



# అన్నపూర్ణ రిజర్వాయర్ సందర్శన

## అనంతగిరి పోచమ్మ ఆలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పూజలు

**రాజన్న సిరిసిల్ల జిల్లా /ఇల్లంతకుంట, ఏప్రిల్ – 29(ప్రజాబలం ప్రతినిధి**ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామ శివారులోని అన్నపూర్ణ రిజర్వాయర్ ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే బుధవారం సందర్శించారు.

రిజర్వాయర్ సామర్థ్యం, నీటి నిల్వ, తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అంతకముందు అనంతగిరి పోచమ్మ దేవాలయాన్ని కలెక్టర్, ఎస్పీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ చరిత్ర, ప్రాముఖ్యత, వివరాలను ఆలయ అధికారులను జిల్లా కలెక్టర్, ఎస్పీ అడిగి తెలుసుకున్నారు.

గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని, పంచాయతీ సి





# డీపీఆర్ఓకు గవర్నర్ ప్రెస్ సెక్రటరీ అభినందనలు




**రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ 29 (ప్రజాబలం ప్రతినిధి)**జిల్లా పౌర సంబంధాల అధికారిగా ఏడుకొండలు ఇటీవల బాధ్యతలు స్వీకరించగా.. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర గవర్నర్ ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీపీఆర్ఓ ఏడుకొండలుకు గవర్నర్ ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com